# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 123

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: శనివారం 23 మే 2026










**న్యూఢిల్లీ, సమయం ప్రతినిధి:** తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సుదీర్ఘకాల మిత్రపక్షాలైన డీఎంకే, కాంగ్రెస్ మధ్య చెడిన బంధం.. ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీలో సరికొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేపుతోంది. తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ తమ కూటమిని వీడి, విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' పార్టీతో జతకట్టడంపై డీఎంకే తీవ్ర ఆగ్రహంతో ఉంది. కాంగ్రెస్‌ను 'వెన్నుపోటుదారు'గా అభివర్ణిస్తున్న డీఎంకే.. పార్లమెంట్‌లో తమ ఎంపీల సీటింగ్ అరేంజ్‌మెంట్‌ను కూడా మార్చాలని, కాంగ్రెస్ నేతలతో కలిసి కూర్చోలేమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయడం సంచలనం రేపుతోంది. ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్న కేంద్రంలోని అధికార బీజేపీ.. పార్లమెంట్‌లో తమ బలాన్ని పెంచుకోవడానికి ఇదొక సువర్ణావకాశంగా భావిస్తోందని రాజకీయ వర్గాల సమాచారం.

**బీజేపీ ఆశలకు కారణాలు ఏంటి?**

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త పార్టీ 'టీవీకే' (TVK) చేతిలో డీఎంకే ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.




**సమయం ప్రతినిధి:** సరిహద్దు చొరబాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. ఇందుకోసం జీరో టాలరెన్స్ పాలసీని అనుసరించనున్నామనీ, దేశ సరిహద్దులను మూసివేసేందుకు ఏడాదిలోగా సమగ్ర 'స్మార్ట్ బోర్డర్' పాలసీని తీసుకురానున్నామని చెప్పారు. అక్రమ వలసదారులను వెనక్కి తిప్పిపంపుతామని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారంనాడు జరిగిన సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సిబ్బంది సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ, అక్రమ వలసలను కృత్రిమంగా దేశ జనాభాలో మార్పు తెచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. దేశ డెమోగ్రాఫిక్స్‌ను సురక్షితంగా ఉంచేందుకు అక్రమ వలసదారులను ప్రభుత్వం గుర్తించి ప్రతి ఒక్కరిని వెనక్కి పంపిస్తుందని స్పష్టం చేశారు. ఇందుకోసం దేశంలోని 6,000 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి అభేద్యమైన భద్రతా గ్రిడ్‌ను అమలు చేస్తుందని చెప్పారు. స్మార్ట్ బోర్డర్ కాన్సెప్ట్ కింద రాడార్లు, అడ్వాన్స్‌డ్ కెమెరాలతో బీఎస్ఎఫ్‌ను అధునాతన టెక్నాలజీతో సన్నద్ధం చేస్తామని వివరించారు.



## గెలిచే సీట్లే ఇస్తాం.. కాంగ్రెస్‌తో పొత్తుపై అఖిలేష్ పార్టీ

**సమయం ప్రతినిధి:** ఉత్తరప్రదేశ్‌లో 'ఇండియా' బ్లాక్ యథాతథంగా ఉంటుందని, కాంగ్రెస్‌తో తమ పొత్తు కొనసాగుతుందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ధ్రువీకరించారు. అయితే సీట్ల షేరింగ్ విషయంలో కాంగ్రెస్‌కు గెలిచే సీట్లే ఇస్తామనే సంకేతాలను ఆ పార్టీ పంపింది. ఆ ప్రకారం ఎస్పీతో కాంగ్రెస్ బేరసారాలు జరిగే అవకాశాలు పరిమితంగానే ఉండొచ్చు. వచ్చే ఏడాది యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అఖిలేష్ తాజా వ్యాఖ్యలు చేశారు. అఖిలేష్ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ, సీట్ల షేరింగ్ అనేది నెంబర్లకు సంబంధించినది కాదని, గెలుపు అవకాశాలపైనే ఉంటుందని తెలిపారు. దీనిపై ఎస్పీ సీనియర్ నేత ఒకరు మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎక్కువ సీట్లు ఆశించేందుకు వీల్లేదని అన్నారు. యూపీలో కాంగ్రెస్ తన బలం గురించి ఎక్కువగా అంచనా వేసుకోరాదని, రాష్ట్రంలో బలమైన సంస్థాగత వ్యవస్థ ఆ పార్టీకి లేదని ఆయన విశ్లేషించారు.




**తెలంగాణ విద్యా రంగంలో సంచలనం చోటుచేసుకుంది. రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తన పదవికి రాజీనామా చేశారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను ఈ కీలక బాధ్యతల్లో నియమించింది. అయితే, తన పదవికి నాలుగు నెలల ముందుగానే రాజీనామా లేఖను ప్రభుత్వానికి సమర్పించడం రాష్ట్ర రాజకీయ, విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ విద్యా రంగంపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం ఆకునూరి మురళి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.**

**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** విద్యా సంస్కరణల నివేదిక పూర్తి కావడంతో తన బాధ్యత ముగిసిందని పేర్కొంటూ, తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (జూ) కి సమర్పించారు. ఇంకా నాలుగు నెలల పదవీ కాలం మిగిలి ఉండగానే ఆయన ఈ పదవి నుంచి తప్పుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ.. తన రాజీనామా విషయమై సీఎం కార్యదర్శికి కూడా ముందస్తు సమాచారం పంపారు.

**వివాదాస్పద సిఫార్సులు.. ఉపాధ్యాయుల నిరసనలు :** ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన కొన్ని సిఫార్సులు తీవ్ర వివాదానికి దారితీశాయి. ముఖ్యంగా రాష్ట్రంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది వేతనాలు మార్కెట్ ప్రమాణాల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని, వాటిని సమీక్షించి 'హేతుబద్ధీకరించాలని' కమిషన్ చేసిన వ్యాఖ్యలపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. దీనికి తోడు ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి, ఇంటర్ విద్యను కూడా పాఠశాల విద్యలోనే విలీనం చేయాలనే ఆలోచనలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ సిఫార్సులపై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలతో పాటు ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి. క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియకుండా ఇలాంటి నివేదికలు ఇచ్చారంటూ ప్రతిపక్ష నేతలు కమిషన్‌పై ధ్వజమెత్తారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం నిర్వహణ



**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి :** మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి తొలుత కలెక్టరేట్ ఆవరణలో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ప్రారంభించారు. స్టాల్‌లో నానో యూరియా, నానో డి.ఏ.పీ.లను ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పచ్చి రొట్టె విత్తనాలను 50 శాతం సబ్సిడీపై 10 మంది రైతులకు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, కలెక్టర్ ఖుష్బూ గుప్తా సంయుక్తంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి. జానకి, జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.







# సంపాదకీయం

## మన స్వదేశీయంలో విదేశీయానిదే విజయమా?

సప్తపదులు, సప్తనదులు, సప్తస్వరాలు, సప్తరుషులు.. ఇట్లా ఏడు అంకె చుట్టూ అనేక జీవిత, ఖగోళ, భౌగోళిక అంశాలను ముడిపెట్టటం మనకు కొత్తకాదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ మొదలుపెట్టిన యుద్ధంతో ఏర్పడిన సంక్షోభాన్ని ఎదుర్కోటానికి ప్రజలు త్యాగాలూ, పొదుపులూ చేయాలంటూ ప్రధాని మోదీ కూడా సప్తసూత్రాలను ప్రకటించారు. దేన్నైనా సప్తసూత్రాలుగా చెబితే ప్రజలను బాగా ఆకర్షిస్తుందనే మోదీ భావించి ఉండొచ్చు. సప్తానికి మన సంస్కృతి చాలా ప్రాధాన్యతను ఇచ్చింది. అందులో సందేహం ఏమీలేదు. ఇక సంస్కృతిలో బాగా పాతుకుపోయిన భావాలను ఉపయోగించుకుని రాజకీయంగా ప్రజలను సమాయత్తం చేయటం అన్ని దేశాల్లోనూ ఉంది. ఇటీవల కాలంలో ఈ విషయంలో మోదీ ప్రదర్శించే ప్రతిభ అసాధారణమైంది! ఇందులో ఆయన దరిదాపులకు వచ్చే నేతలను ప్రపంచం మొత్తంలోనే వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ఆచారాలు, నమ్మకాలు, ఇష్టాయిష్టాల్లో ఎంతో వైవిధ్యం ఉన్న దేశంలో మంచికైనా చెడుకైనా సంస్కృతిని ఆధారం చేసుకుని జనాన్ని రాజకీయ లక్ష్యాలవైపు ఆకర్షించటం అంత సులువుకాదు. రాజకీయ లక్ష్యాలు సంకుచితమైనవైతే సంస్కృతి కూడా చివరికి అదే దారిలోకి వెళుతుంది. దీనికి ఏ దేశమూ మినహాయింపుకాదు.

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు 40 రోజులపాటు భీకరంగా దాడులు చేశాయి. వీటిని అసాధారణలో రీతిలో తట్టుకుంటూ ఇరాన్ ప్రతిదాడులనూ చేసింది. గల్ఫ్‌దేశాల్లోని అమెరికా సైనికస్థావరాలు ఆ ప్రతిదాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్నాయి. అమెరికాకు ఇంతకు మించిన తలవంపు ఇటీవల కాలంలో మరొకటి లేదు. కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత కూడా హోర్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధం చేయటంతో చమురు, సహజవాయువు, ఎరువుల రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ప్రపంచ సరఫరా వ్యవస్థే గాడితప్పింది. అయినా అయిదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసే వరకూ యుద్ధప్రభావం గురించి విపులంగా ప్రధాని మోదీ ఎప్పుడూ మాట్లాడలేదు. అంతకు ముందుకూడా అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకమని బహిరంగంగా ప్రకటించనూ లేదు. యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అయిపోతోందనీ దాన్ని దృష్టిలో పెట్టుకునైనా యుద్ధం ఆపాలనీ కోరలేదు. కొండెక్కిన చమురు ధరలతోనూ ఇతరత్రానూ దిగుబడుల భారం పెరిగి విదేశీ మారకద్రవ్య నిల్వలు భారీగా హరించుకుపోయే ప్రమాదం ముంచుకొస్తూ ఉండటంతో త్యాగాలు చేయాలనీ, పొదుపులు పాటించాలనీ ప్రజలకు పిలుపునిచ్చారు.

సప్తసూత్రాల్లో స్వదేశీ వస్తువులను కొనాలనే పిలుపు కూడా ప్రధానంగా ఉంది. గ్లోబలైజేషన్ తర్వాత ఈ స్వదేశీ నినాదం ఎంతమేరకు ఆచరణాత్మకమో పరిశీలిస్తే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ఏదీ విదేశీ, ఏదీ స్వదేశీ అన్న గీతలు గీయటం కూడా కష్టమైపోతోంది. మేడిన్ ఇండియా వస్తువుల లోగుట్టుని లోతుగా చూస్తే అందులోని విదేశీయత రట్టు అవుతుంది. నూటికినూరుపాళ్లూ స్వదేశీ కంపెనీ ఉత్పత్తులనే కొనాలనుకుంటే మన ఎంపిక చాలా పరిమితం అయిపోతుంది. విదేశీ మారకద్రవ్యం పొదుపు లక్ష్యంగా ఇక్కడ తయారయ్యే వస్తువులను కొనుగోలు చేయించటమే మోదీ పిలుపు పరమార్థమైతే మనం పెద్దగా ఆలోచించాల్సిన అవసరం ఉండదు. 90శాతం మంది ప్రజలకు ఇక్కడే దొరికే వస్తువులే బోలెడు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో అచ్చంగా ఏవి స్వదేశీ అన్నవే సమస్య! మనం రోజూ వాడే వస్తువులనూ, ఉపకరణాలనూ స్వదేశీ కంపెనీలే తయారుచేయటం లేదు. అవి ఇక్కడ ఉత్పత్తి అవుతున్నా వాటిని స్వదేశీయతకూ, స్వావలంబనకూ ఉదాహరణలుగా చెప్పుకోలేం. అవన్నీ ప్రధానంగా విదేశీ కంపెనీల చేతుల్లో ఉన్నాయి. సర్ఫ్ ఎక్సెల్, లక్స్, లైఫ్‌బాయ్, క్లినిక్ ప్లస్, డవ్, క్లోజప్, బ్రూక్‌బాండ్ రెడ్‌లేబుల్, బ్రూ, హార్లిక్స్, బూస్ట్, లేస్, ట్రోపికానా, జిలెట్, హెడ్ అండ్ షోల్డర్స్, కాల్గేట్, పెప్సొడెంట్, మ్యాగీ, నెస్‌కేఫ్, కిట్‌క్యాట్, సెరెలాక్, కెల్లాగ్ కోర్న్‌ఫ్లేక్స్, కోకకోలా, థమ్స్‌అప్, పెప్సీ, కుర్కురే, వ్యాసలీన్, లాక్మే, పాండ్స్, రిన్, పియర్స్ లాంటి ఉత్పత్తులన్నీ విదేశీ బహుళజాతి సంస్థలకు అనుబంధంగా ఉన్న కంపెనీల నుంచే వస్తున్నాయి. మనం వినియోగించే వస్తువులన్నీ లెక్కలోకి తీసుకుంటే ఈ జాబితా ఇంకా పెరుగుతుంది. ఈ కంపెనీల్లో భారతీయుల పెట్టుబడులు లేవా? అంటే ఉన్నాయి. అవన్నీ చాలా వరకూ 45శాతం లోపే ఉంటాయి. కానీ విదేశాల్లోని మూల కంపెనీలకు సంబంధించిన పెట్టుబడులే అధికంగా ఉంటాయి. కీలక నిర్ణయాలన్నిటినీ అవే శాసిస్తాయి. ఐటీసీ, అమూల్, డాబర్, మ్యారికో, బ్రిటానికా, గోద్రేజ్, పార్లే లాంటి భారత కంపెనీల ఉత్పత్తులు కూడా మార్కెట్‌లో రాణిస్తున్నాయి. కానీ వీటి ఉత్పత్తుల వాటా మార్కెట్‌లో 42--48శాతం మధ్యలోనే ఉంటుంది. వీటితో పోల్చితే బహుళజాతి సంస్థల అనుబంధ కంపెనీల ఉత్పత్తుల వాటా ఎక్కువ. అది 52--58శాతం ఉంటుంది. నెలనెలా వాడుకునే ఈ ఉత్పత్తుల్లో భారత యాజమాన్యంలోని కంపెనీల వాటా 45శాతం ఉండటం ఊరటగా అనిపించొచ్చు. కంప్యూటర్లు, వాహనాలు, రిఫ్రిజిరేటర్లు, మొబైల్స్ దగ్గరకు వెళితే స్వదేశీ కంపెనీలు ఎక్కడో ఉంటున్నాయి. ముందుగా మొబైల్ ఫోన్ల సంగతి చూద్దాం. భారతీయుల యాజమాన్యంలో ఉన్న మొబైల్ కంపెనీలు లావా, మైక్రోమాక్స్, కార్బన్ తయారుచేసే మొబైళ్ల మార్కెట్ వాటా 2-3శాతం మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది. మిగతావన్నీ విదేశీ కంపెనీల మొబైళ్లే. యాపిల్ ఫోన్లను ఇక్కడ తయారుచేసే కంపెనీల్లో కూడా ఫాక్స్‌కాన్‌దే (తైవాన్) ఆధిపత్యం. మన టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ కూడా 35 శాతం వరకూ యాపిల్ ఫోన్లను తయారుచేస్తోంది. విస్ట్రన్, పెగట్రాన్ లాంటి తైవాన్ కంపెనీలో షేర్లు కొనుగోలుచేసి యాజమాన్యాన్ని పొందటంతో టాటా ఎలక్ట్రానిక్స్ ఆ పనిని సులభంగా చేయగలుగుతోంది.

# కేంద్ర కేబినెట్‌లోకి డీకే అరుణ ?

- పాలమూరు రాజకీయాల్లో జోరుగా చర్చ
- గతంలో సూదిని జైపాల్ రెడ్డి జాతీయ స్థాయిలో ముద్ర..
- ఇప్పుడు డీకే అరుణపై ఆశలు
- అరుణమ్మకు దక్కితే పాలమూరుకు మహర్దశ



**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి :** కేంద్రంలో భారీ స్థాయిలో మంత్రివర్గ మార్పులు జరగొచ్చన్న రాజకీయ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణకు కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కే అవకాశాలపై పాలమూరు రాజకీయాల్లో జోరుగా చర్చ సాగుతోంది. తెలంగాణలో బీజేపీని మరింత బలోపేతం చేయాలన్న వ్యూహంలో భాగంగా కేంద్ర నాయకత్వం రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వొచ్చన్న అంచనాల మధ్య డీకే అరుణ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. మహిళా నాయకత్వానికి ప్రాధాన్యం, తెలంగాణలో పార్టీ విస్తరణ, సామాజిక సమీకరణాలు, అనుభవజ్ఞులైన నేతలకు అవకాశాల కల్పన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే డీకే అరుణకు కేంద్ర మంత్రివర్గంలో అవకాశం లభించే సూచనలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దక్షిణ భారతదేశ పై బిజెపి ఫోకస్ చేస్తున్న నేపథ్యంలో తెలంగాణలో అగ్ర నాయకురాలిగా, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలుగా ఉన్న అరుణమ్మకు కేబినెట్లో అవకాశాలు దక్కుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

**జడ్పీటీసీ నుంచి ఎంపీగా..**

మహబూబ్‌నగర్‌ఎంపీడీకే అరుణ రాజకీయ ప్రస్థానం అసాధారణం. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయికి, జడ్పీటిసి నుంచి ఎంపీగా ఎదిగిన తీరు పాలమూరుకు గర్వకారణంగా చెప్పవచ్చు. డీకే అరుణ రాజకీయ ప్రయాణం గ్రామస్థాయి నుంచి ప్రారంభమై జడ్పీటీసీ, ఎమ్మెల్యే, మంత్రిగా కొనసాగింది. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన ఆమె అనంతరం బీజేపీలో చేరి ప్రస్తుతం జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడం, క్రమశిక్షణ గల మహిళా నాయకురాలిగా గుర్తింపు పొందడం, తెలంగాణలో వివిధ రాజకీయ వర్గాలతో అనుబంధాలు కొనసాగించడం ఆమెకు కలిసొచ్చే అంశాలుగా భావిస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన బలమైన మహిళా నాయకురాలిగా రాష్ట్రంలో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. పాలమూరు జిల్లాకు కేంద్ర మంత్రివర్గ ప్రాతినిధ్యం విషయానికి వస్తే, గతంలో సూదిని జైపాల్ రెడ్డి జాతీయ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు. మహబూబ్‌నగర్ జిల్లా మద్దుల్ ప్రాంతానికి చెందిన జైపాల్ రెడ్డి కేంద్ర సమాచార-ప్రసార శాఖ మంత్రిగా పనిచేసి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆయన వాగ్ధాటి, రాజకీయ పరిజ్ఞానం, పరిపాలనా సామర్థ్యంతో జాతీయ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కేంద్ర సమాచార శాఖతో పాటు పెట్రోలియం, పట్టణాభివృద్ధి వంటి కీలక శాఖలను నిర్వహించి సమర్థవంతమైన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. జైపాల్ రెడ్డి తర్వాత పాలమూరు జిల్లాకు ఆ స్థాయి జాతీయ గుర్తింపు కలిగిన కేంద్ర మంత్రి లేరనే అభిప్రాయం స్థానికంగా ఉంది. ఈ నేపథ్యంలో డీకే అరుణకు కేంద్ర మంత్రివర్గంలో అవకాశం వస్తే జిల్లాకు మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా సమాచార--ప్రసార శాఖ వంటి ప్రాధాన్యత గల శాఖ లభిస్తే పాలమూరు జిల్లాకు మరింత పేరు వస్తుందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. దేశ రాజకీయాల్లో నార్త్ లో బిజెపి అత్యంత బలోపేతంగా ఉన్నది. ఈ క్రమంలో దక్షిణ భారతదేశంపై ఫోకస్ పెంచిన బిజెపి ముఖ్యంగా తెలంగాణలోనూ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు శతవిధాలా ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ క్రమంలో తెలంగాణ బిజెపి ఎంపీల్లో అత్యంత శక్తివంతమైన మహిళగా గుర్తింపు ఉన్న డీకే అరుణకు కేంద్ర క్యాబినెట్ లోకి అవకాశం కల్పిస్తే పార్టీ ఇక్కడ మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నట్లు తెలుస్తున్నది. అయితే కేంద్ర మంత్రివర్గంలో ఎవరికి అవకాశం దక్కాలన్నది పూర్తిగా బీజేపీ అధిష్టానం నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని, అధికారిక ప్రకటన వెలువడే వరకు ఇవన్నీ రాజకీయ వర్గాల్లో జరుగుతున్న అంచనాలుగానే చూడాల్సి ఉంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# కాక్రోచ్ జనతా పార్టీ ఫాలోవర్స్ ...పాకిస్తానే టాప్

**న్యూఢిల్లీ :** ఒక పార్టీ అధికారంలోకి రావాలంటే జనాలు ఓట్లు వేయాలి.. ప్రత్యర్థి పార్టీకి మించి ఓట్లు వస్తేనే అధికారాన్ని దక్కించుకోవడానికి సాధ్యమవుతుంది. అలాకాకుండా కేవలం సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ను చూసి అధికారంలోకి వస్తామనుకుంటే అంతకు మించిన భ్రమ ఇంకొకటి ఉండదు. సోషల్ మీడియా ప్రామాణికమైతే ఇన్స్టాగ్రామ్ లో విరాట్ కోహ్లీకి 100 మిలియన్లకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. అలాంటప్పుడు ఆయన మన దేశానికి ప్రధానమంత్రి కావాలి కదా..కొంతమంది ఏదో ఆగ్రహంలో పెట్టిన కాక్రోచ్ జనతా పార్టీ.. ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఏకంగా బిజెపి పార్టీకి మించిన ఫాలోవర్స్ ను సంపాదించుకొని కలకలం రేపుతుంది. దీనిని చాలామంది జనరేషన్ జెడ్ తరంలో రగిలిన ఉద్యమం అని పిలుస్తున్నారు. ఇది సార్వత్రిక ఎన్నికల్లో పెను మార్పుకు నాంది పలుకుతుందని జోస్యం చెబుతున్నారు. సాధారణంగా ఇటువంటి సంచలన విషయాలు తెరపైకి వచ్చినప్పుడు.. కొంతమంది స్వయం ప్రకటిత మేధావులు రకరకాలు వ్యాఖ్యలు చేస్తూ ఉంటారు. ఇలాంటివారు కొద్ది రోజులు మీడియాలో హల్చల్ చేస్తారు. ఆ తర్వాత జనం మర్చిపోతారు. మనదేశంలో ప్రజాస్వామ్యానికి ఒక విలువ ఉంది. దానికంటూ బలమైన నిర్మాణం ఉంది. అధికారంలో ఉన్న పార్టీ తప్పు చేస్తే.. ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి అధికారాన్ని కట్టబెడతారు. ఒకవేళ రెండు పార్టీలు ప్రజల అభిమానాన్ని సొంతం చేసుకోకపోతే.. మూడో పార్టీకి అధికారాన్ని దక్కేలా చేస్తారు. అంతేతప్ప సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ఆధారంగా అధికారాన్ని కట్టబెట్టరు.. తాత్కాలిక ఆవేశాలు వేరు.. దీర్ఘకాలిక ప్రణాళికలు వేరు. రెండు కూడా ఒకే విధంగా ఎప్పుడూ ఉండవు. ఇక కాక్రోచ్ జనతా పార్టీ విషయంలో పాకిస్తాన్ హస్తము ఉందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది.. ఎప్పుడైతే ఈ పార్టీకి ఇన్స్టాగ్రామ్ లో విపరీతమైన ఫాలోవర్స్ నమోదయ్యారో.. అప్పుడే కొంతమంది దీని వెనక ఏదో జరుగుతోందని అనుకున్నారు. దానికి తగ్గట్టుగానే పరిశోధన మొదలు పెట్టారు. చివరికి అసలు నిజాన్ని బయటపెట్టారు.కాక్రోచ్ జనతా పార్టీ ని అనుసరిస్తున్న ఫాలోవర్స్ లో పాకిస్తాన్ నుంచి 49 శాతం, అమెరికా నుంచి 14 శాతం, బంగ్లాదేశ్ నుంచి 14%, ఇండియా నుంచి తొమ్మిది శాతం, యూకే, ఆస్ట్రేలియా, సౌదీ అరేబియా, ఇతరులు మూడు శాతం, యూఏఈ నుంచి రెండు శాతం అనుసరిస్తున్నారు. దీని వెనక కుట్ర కోణం ఉందని.. అందువల్లే ఓవర్ నైట్ లో కాక్రోచ్ జనతా పార్టీకి ఈ స్థాయిలో ఫాలోవర్స్ ఉన్నారని సోషల్ మీడియాలో బిజెపి అనుకూల వ్యక్తులు వ్యాఖ్యానిస్తున్నారు.

# కూటమి వైపు చూస్తున్న వైసీపీ నేతలు

**విజయవాడ :** ఏపీలో రాజ్యసభ పదవుల సందడి మొదలైంది. నలుగురు పదవీ విరమణ చేయనున్నారు. ఆ నాలుగు పదవులు కూటమికి దక్కనున్నాయి. అయితే రాజ్యసభ పదవులకు ముగ్గురు వైసీపీ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. అందులో ఇద్దరు పరిస్థితి ఏంటనేది తెలియాల్సి ఉంది. వారిద్దరూ తెలుగుదేశం పార్టీలో చేరుతారన్న ప్రచారం నడుస్తోంది. అందులో ఒకరు బిజెపి లోకి వెళ్లిన ఆశ్చర్యపోనవసరం లేదన్న టాక్ నడుస్తోంది. ప్రధానంగా పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి చుట్టూ ఇప్పుడు కొత్త ప్రచారం మొదలైంది. ఇందులో సుభాష్ చంద్రబోస్ టిడిపి వైపు.. ఆళ్ల అయోధ్య రామిరెడ్డి బిజెపి వైపు వెళ్తారని పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. వచ్చేనెల 21తో వారి రాజ్యసభ పదవీకాలం ముగియనుంది. వారి స్థానంలో కొత్త వారి ఎంపిక కోసం ఈరోజు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది.ఏపీ నుంచి ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళనత్వాని, సానా సతీష్ పదవి విరమణ చేయనున్నారు. ఇందులో సతీష్ టీడీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు. ఏడాది కిందట ఆయనకు రాజ్యసభ పదవి దక్కింది. ఆ సమయంలోనే మరోసారి రెన్యువల్ చేస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు పరిమళానత్వాన్ని బిజెపి కోటాలో అప్పట్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అవకాశమిచ్చింది.

# అనలిస్ట్ లు మితిమీరుతున్నారా...

**గుంటూరు :** ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ఏపీ ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, మరో మంత్రి నాదెండ్ల మనోహర్ కలిశారు. రాజకీయ పరమైన అంశాలు.. అభివృద్ధి పరమైన అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయి. సుమారు 25 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జరిగింది ఒకటైతే.. బయటికి వచ్చింది మరొకటి. ముఖ్యంగా ప్రముఖ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ వీరి భేటీ పై తనదైన వ్యాఖ్యానం చేశారు.జగన్మోహన్ రెడ్డిని అరెస్ట్ చేయాలని పవన్ కళ్యాణ్ ప్రతిపాదించినట్టు.. దానికి అమిత్ షా ఒప్పుకోన్నట్టు.. పైగా జగన్మోహన్ రెడ్డిని లాంగ్ టర్మ్ పొలిటికల్ ఫ్రెండ్ అని అమిత్ షా వ్యాఖ్యానించినట్టు నాగేశ్వర్ చెప్పుకొచ్చారు.. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలను వైసిపి విపరీతంగా ప్రచారం చేయడం మొదలుపెట్టింది. నిన్నటి నుంచి అటు మీడియాలో.. ఇటు సోషల్ మీడియాలో దీని గురించి విపరీతమైన చర్చలు నడుపుతోంది.. జగన్మోహన్ రెడ్డికి ప్రజల్లో సింపతిని కలగజేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అంతేకాదు నిన్న నాగేశ్వర్ వ్యాఖ్యలు చేయడం.. ఈరోజు జగన్ విలేకరుల సమావేశంలో మాట్లాడటం.. పైగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణానికి ముందు కొద్దిరోజుల క్రితం చంద్రబాబు ఆగ్రహంగా మాట్లాడారని.. ఆ తర్వాత వైఎస్ కన్నుమూశారని.. జగన్ మాట్లాడారు.. దీంతో ఏపీ రాజకీయాలలో ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి..నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో జనసేన నాయకులు సోషల్ మీడియాలో.. మీడియాలో తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేస్తున్నారు.. ప్రొఫెసర్ నాగేశ్వర్ అమ్ముడుపోయారని.. ఊహాజనితమైన విషయాలను చెబుతున్నారని.. తద్వారా ప్రజలలో అశాంతి కలిగించేందుకు కుట్ర పన్నుతున్నారని జనసేన నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే నాగేశ్వర్, ఆయన మాట్లాడిన మాటలను టెలికాస్ట్ చేసిన ఛానల్ మీద పోలీసులకు జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. కాకినాడ జిల్లాలోని ఇంద్ర పాలెం పోలీస్ స్టేషన్లో జనసేన కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ మీద చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని నాగేశ్వర్ కు సూచించారు. మరోవైపు నాగేశ్వర్ మీద ఫిర్యాదు దాఖలైన నేపథ్యంలో.. పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది..నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యల పట్ల అన్ని వర్గాల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతుంది. ఎందుకంటే రాజకీయంగా జరిగిన భేటీలో చర్చకు రాని విషయాలను ప్రస్తావించడం నాగేశ్వర్ లాంటి వ్యక్తులకు సరికాదని జనసేన నాయకులు అంటున్నారు.. మరోవైపు కూటమి ప్రభుత్వం నాగేశ్వర్ పై చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. అంతేకాదు టిడిపి సోషల్ మీడియా కూడా నాగేశ్వర్ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది.. నాగేశ్వర్ వైసీపీ కండువా కప్పుకున్న ఫోటోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సృష్టించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.. దీంతో నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యల వివాదం మరో మలుపుతీసుకుంది. అయితే ఇది ఎక్కడదాకా వెళ్తుందో చూడాల్సి ఉంది.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో ప్రభుత్వ ఫలాలు ప్రతి పేద కుటుంబానికి చేరాలి: ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి:** మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే "ప్రజల వద్దకే పాలన" లక్ష్యంతో ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాలు, పట్టణాల్లో ప్రజలను నేరుగా కలుసుకుని ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారికి పారదర్శకంగా ఫలాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని ఆయన అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. రైతు మరణిస్తే కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గ్రామాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకుంటున్నారని, ప్రభుత్వం రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. జిల్లాలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని



తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవల కోసం మండల, నియోజకవర్గ స్థాయిలో ఆసుపత్రుల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. విద్యా రంగంలో నాణ్యమైన బోధన, సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ తరగతులు, డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచేందుకు "బడిబాట" కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందించే పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, బ్యాంక్ లింకేజీలు అందిస్తూ ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. రైతులు పండించే ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అధికారులు ప్రజలతో సమర్థవంతమైన కమ్యూనికేషన్ కొనసాగిస్తూ పథకాల అర్హతలు, దరఖాస్తు విధానంపై స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. జిల్లా ఎస్పీ డి. జానకి రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలను వివరించి, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అందరూ సహకరించాలని కోరారు. మేయర్ గుమ్మాల మమత మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ చారిత్రాత్మక కార్యక్రమమని అన్నారు. సమావేశానికి ముందు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, కలెక్టర్ ఖుష్బూ గుప్తా కలిసి కలెక్టరేట్ ప్రాంగణంలో వైద్య ఆరోగ్యం, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవన శాఖలు ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను ప్రారంభించి పరిశీలించారు. ఇందిరా మహిళా శక్తి స్టాల్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. కార్యక్రమంలో మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బి. అనిత మధుసూదన్ రెడ్డి, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాల్‌కోటి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఆర్వో రామ్‌రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మోడీ దెబ్బకు పార్లే మెలోడీ ఎక్కడికో వెళ్లిపోయింది..

**హైదరాబాద్ :** అప్పట్లో నరేంద్ర మోడీ అండమాన్ నికోబార్ ఐలాండ్స్ కి వెళ్లారు. దేశ ప్రజలకు ఒక పిలుపునిచ్చారు.. విహారయాత్రలకు విదేశాలకు వెళ్లకూడదని.. మనదేశంలో ఉన్న ఇటువంటి ప్రాంతాలను సందర్శించాలని.. అప్పుడు పర్యాటకంగా దేశానికి ఆదాయం లభిస్తుందని.. స్థానికంగా ఉన్న వ్యక్తులకు ఉపాధి కలుగుతుందని పేర్కొన్నారు. నరేంద్ర మోడీ ఆ మాట చెప్పడమే ఆలస్యం.. ఒక్కసారిగా అండమాన్ నికోబార్ ఐలాండ్స్ కు పర్యాటకులు పెరిగిపోయారు. ఇదే సమయంలో మాల్దీవులు ప్రాంతానికి వెళ్లే పర్యటకుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. చివరికి ఆ దేశంలో ఆర్థికంగా సమస్యలు, రాజకీయంగా ఇబ్బందులు ఏర్పడ్డాయి. చివరికి మాల్దీవులు ఆర్థికంగా దివాలా తీసే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు నరేంద్ర మోడీ మరో సంచలనానికి నాంది పలికారు. ఇటలీలో ప్రకటించిన నరేంద్ర మోడీ.. ఆ దేశ ప్రధాని జార్జియా మెలోని కి అపురూపమైన కానుక ఇచ్చారు. ఆ కానుక పేరు మెలోడీ చాక్లెట్లు. దీంతో మెలోడీ చాక్లెట్లు మీడియాలో.. సోషల్ మీడియాలో విపరీతమైన సర్క్యులేషన్ లో ఉంది. మెలోని, మోడీ కలిసి మెలోడీ చాక్లెట్లను ఇచ్చుకుంటూ ఫోటోలకు ఫోజులిచ్చారు. దీంతో మెలోడీ బ్రాండ్ విలువ పెరిగిపోయింది. సాధారణంగా మెలోడీ చాక్లెట్లను పార్లే కంపెనీ తయారుచేస్తోందని అందరూ అనుకుంటున్నారు. ఈ చాక్లెట్లకు పార్లే కంపెనీకి ఎటువంటి సంబంధం లేదు. పైగా ఈ కంపెనీ స్టాక్ మార్కెట్లో మెలోడీ చాక్లెట్లను తయారుచేసే పార్లే ప్రొడక్ట్స్ లిస్ట్ అవలేదు. మోడీ స్వయంగా మెలోనికి మెలోడీ చాక్లెట్లు ఇవ్వడంతో ఒక్కసారిగా ఆ బ్రాండ్ విలువ పెరిగిపోయింది. అయితే చాలామంది పార్లే ఇండస్ట్రీస్ మెలోడీ చాక్లెట్ తయారు చేస్తోందని అనుకున్నారు. కానీ ఆ సంస్థ ఇన్ఫ్రాస్ట్రక్చర్, రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ విభాగంలో కార్యకలాపాలు సాగిస్తోంది. ఈ కంపెనీ బిఎస్ఈ లో లిస్ట్ అయింది. ఇటీవల పునరుత్పాదక విభాగంలో కూడా ఈ కంపెనీ అడుగుపెట్టింది. వరుసగా రెండు రోజులపాటు పార్లే కంపెనీ షేర్లు అప్పర్ సర్క్యూట్ అందుకున్నాయి. అయితే ఈ కంపెనీ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే.. స్టాక్స్ కొంతకాలంగా ఒడిదుడుకులకు గురవుతున్నాయి.. అయితే ఈ సంస్థ షేర్ ముఖ విలువ గత మూడు నెలల్లో 35% తగ్గింది. ఇక ఏడాది ప్రారంభంలో అయితే 41% తగ్గిపోయింది. నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన తర్వాత ఈ కంపెనీ షేర్ విలువ పెరిగిపోయింది. అయితే కొంతకాలంగా నష్టాలు కలవరపెడుతున్న నేపథ్యంలో ఈ కంపెనీ తేరుకుంది. అప్పర్ సర్క్యూట్ ఇంకా కొద్దిరోజులపాటు సాగితే కంపెనీ కష్టాలు మొత్తం తీరుతాయని.. అయితే ఇప్పటికే మీడియాలో అసలు విషయం తెలియడంతో మదుపరులు ఆ నిర్ణయం తీసుకోకపోవచ్చు అని తెలుస్తోంది.

## బీఆర్ఎస్ రాష్ట్రాన్ని ఆగం చేసింది: యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్ :** పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ఆగం చేసిందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. అమెరికాకు వెళ్లి అక్కడ కూడా తెలంగాణ పరువు తీసేలా బీఆర్ఎస్ నేత హరీష్ రావు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఓర్వలేక ప్రతిపక్ష నేతలు విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047లో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు సమీపంలో ముంబై-నవీ ముంబై, నోయిడా-గురుగ్రామ్ తరహాలో ఆధునిక సాంకేతికతతో కూడిన మహానగరాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన 13,500 ఎకరాలకు తోడు మరో 30 వేల ఎకరాలతో ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఏఐ, డిజిటల్ సర్వీసెస్, హెల్త్ అండ్ లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఫార్మా, ఎడ్యుకేషన్ నాలెడ్జ్ హబ్, ఈవీ మ్యానుఫ్యాక్చరింగ్, టూరిజం తదితర రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మొత్తం 12 ప్రత్యేక జోన్లతో ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకోనుందని, దీని ద్వారా 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. గ్రామీణ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, జిల్లాల్లో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఫ్యూచర్ సిటీకి పారిశ్రామిక దిగ్గజాల మద్దతు లభిస్తోందని, మచిలీపట్నం పోర్టుకు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కూడా సీఎం విజన్‌లో భాగమని చెప్పారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటూ హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ భవిష్యత్తును దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. పెట్టుబడిదారులను భయపెట్టి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్‌ను తిరస్కరించారని, పాదయాత్రలు, మోకాల యాత్రలు చేసినా ఆ పార్టీకి పునర్జీవం లేదని వ్యాఖ్యానించారు.

## హైదరాబాద్‌లో కోపైలట్ 365

**హైదరాబాద్ :** మైక్రోసాఫ్ట్ సంస్థ భారతదేశంలో తన క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మౌలిక సదుపాయాలను భారీగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే విశాఖపట్నంలో ఒక డేటా సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపిన ఐటీ దిగ్గజం, ఇప్పుడు తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో మరో ప్రతిష్టాత్మక డేటా సెంటర్ నిర్మాణానికి నడుం బిగించింది. ఆసియా ఖండంలోనే మైక్రోసాఫ్ట్ పెడుతున్న అతిపెద్ద పెట్టుబడిగా ఇది నిలవనుంది. గత సంవత్సరం డిసెంబర్‌లో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల తన భారత ఏఐ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా తమ ఉనికిని, సాంకేతిక సామర్థ్యాన్ని మరింత విస్తరించడానికి రాబోయే నాలుగేళ్లలో కంపెనీ ఏకంగా 17.5 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లో డాటా సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. అయితే 2026 మధ్య నాటికి ఈ కొత్త డేటా సెంటర్‌ను ప్రారంభించే అవకాశం ఉందని, దీనితో భారతదేశంలోనే మైక్రోసాఫ్ట్ అతిపెద్ద హైపర్‌స్కేల్ ఉనికిని కలిగి ఉంటుందని సత్య నాదెళ్ల స్పష్టం చేశారు. భారతదేశంలో మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ సేవలతో పాటు, వారి సరి కొత్త ఏఐ అసిస్టెంట్ 'కోపైలట్ 365' కి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. నెలకు సుమారు 30 డాలర్ల ధర కలిగిన ఈ అధునాతన ఏఐ సహాయకుడిని వినియోగించుకోవడానికి భారతీయ కార్పొరేట్ రంగం ఎంతో ఆసక్తి చూపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆసియా వ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ కేటాయించిన భారీ పెట్టుబడిలో సింహభాగం నేరుగా ఈ హైదరాబాద్ డేటా సెంటర్ నిర్మాణానికే తరలిరావడం విశేషం. హైదరాబాద్‌లో ఏర్పాటు కాబోతున్న ఈ డేటా సెంటర్ ప్రధానంగా భారతదేశంలోని ప్రముఖ ఐటీ దిగ్గజాల ఏఐ సేవల అవసరాలను తీర్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ వంటి ప్రధాన కంపెనీల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవల కోసం డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. సమాచారం ప్రకారం.. ఈ టాప్ ఐటీ కంపెనీలలో ప్రతి ఒక్కటి ఇప్పటికే సుమారు 50,000 కోపైలట్ లైసెన్సులను కలిగి ఉన్నాయి. ఈ భారీ డిమాండ్‌కు అనుగుణంగా అత్యంత వేగవంతమైన, సురక్షితమైన క్లౌడ్ మౌలిక సదుపాయాలను హైదరాబాద్ డేటా సెంటర్ కీలక పాత్ర పోషించనుంది.

## అడుగుకో అవినీతి తిమింగళం...

**హైదరాబాద్ :** హైదరాబాద్ జలమండలి జనరల్ మేనేజర్ కుమార్ నివాసాలపై జరిగిన ఏసీబీ దాడులు, అక్కడ బయటపడిన రూ. 100 కోట్ల అక్రమ ఆస్తుల ఉదంతం నగరంలో అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుందో మరోసారి నిరూపించింది. నెలకు లక్షన్నర రూపాయల పరిమిత జీతం తీసుకునే ఒక ప్రభుత్వ ఉద్యోగి, కొద్ది సంవత్సరాల వ్యవధిలోనే ఇంతటి భారీ సామ్రాజ్యాన్ని ఎలా నిర్మించగలిగారనే ప్రశ్న సామాన్యుడిని విస్మయానికి గురిచేస్తోంది. హైదరాబాద్ మహానగర పరిధిలోని ప్రభుత్వ శాఖలైన జీహెచ్ఎంసీ, జలమండలి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ , టౌన్ ప్లానింగ్ విభాగాల్లో అవినీతి అనేది ఒక సమాంతర ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందింది. లంచాల రూపంలో వస్తున్న ఈ అక్రమ సొమ్మంతా మెట్రో నగర శివార్లలోని రియల్ ఎస్టేట్ రంగంలోకి అడ్డూఅదుపూ లేకుండా ప్రవహిస్తోంది. ఐటీ కారిడార్‌లోని విలాసవంతమైన గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, రీజినల్ రింగ్ రోడ్డు పరిసరాల్లోని వందలాది ఎకరాల ల్యాండ్ బ్యాంకులు మెజారిటీ భాగం ఇలాంటి కలుషిత సంపాదనతోనే కొనుగోలు చేస్తున్నారు. నిజాయితీగా సంపాదించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు లేదా వ్యాపారవేత్తల కంటే, ఇరుకు గదుల్లో కూర్చునే అవినీతి ప్రభుత్వ అధికారులే నేడు రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను శాసిస్తూ ధరలను కృత్రిమంగా పెంచుతున్నారు. అక్రమార్కులను పట్టుకోవడానికి ఏసీబీ దాడులు నిర్వహిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ కేసుల పర్యవసానాలు శూన్యంగా మారుతున్నాయి. ఇటీవల వెలువడిన గణాంకాల ప్రకారం, తెలంగాణ ఏసీబీ నమోదు చేస్తున్న కేసుల్లో నిందితులకు కోర్టుల ద్వారా శిక్షలు పడుతున్న రేటు అత్యంత నిరాశాజనకంగా ఉంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో శిక్షల శాతం కేవలం 20 నుండి 25 శాతం లోపే ఉంటోంది. అంటే, పట్టుబడిన ప్రతి పది మంది అవినీతి అధికారుల్లో కనీసం ఏడుగురు చట్టంలోని లోపాల ద్వారా క్లీన్ చిట్‌తో బయటకు వస్తున్నారు లేదా కేసులను దశాబ్దాల పాటు సాగదీసి సాక్ష్యాలు లేకుండా చేస్తున్నారు. ఈ సేఫ్ ఎగ్జిట్ భరోసాయే అధికారులను మరింతగా బరితెగించేలా చేస్తోంది. ఈ వైఫల్యానికి ప్రధాన కారణం ఏసీబీ దర్యాప్తులో కనిపిస్తున్న లోపాలు . పక్కా సాక్ష్యాధారాలను కోర్టుల ముందుంచలేకపోవడమే. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఆస్తుల విలువను కట్టేటప్పుడు దర్యాప్తు అధికారులు మార్కెట్ విలువను కాకుండా పాత రిజిస్ట్రేషన్ విలువను ప్రామాణికంగా తీసుకోవడం నిందితులకు మేలు చేస్తోంది. బినామీల పేరిట ఉన్న ఆస్తులకు, సదరు అధికారికి ఉన్న ఆర్థిక సంబంధాలను చట్టబద్ధంగా నిరూపించడంలో విఫలమవుతోంది. దీనికి తోడు, కేసు నమోదైన తర్వాత చార్జ్‌షీట్ దాఖలు చేయడానికే ఏసీబీకి సంవత్సరాల సమయం పడుతుండటంతో కీలక సాక్ష్యాలు కనుమరుగవుతున్నాయి. పట్టుబడిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో మరియు న్యాయస్థానాల్లో విచారణ జరపడానికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు రావడంలో జరుగుతున్న జాప్యం అవినీతి నిరోధక చట్టం ఆత్మను దెబ్బతీస్తోంది. ఉన్నతాధికారుల, రాజకీయ నాయకుల అండదండలు ఉన్న లంచగొండులకు ఈ శాంక్షన్లు రాకుండా తెరవెనుక పెద్ద ఎత్తున లాబీయింగ్ సాగుతుంది. ఒకవేళ ఏసీబీ గట్టిగా ప్రయత్నించి సస్పెండ్ చేయించినా, కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే వారు ట్రిబ్యునళ్లు లేదా కోర్టుల నుండి స్టేలు తెచ్చుకుని, తిరిగి అదే శాఖల్లో కీలకమైన పోస్టుల్లో కొలువుదీరుతున్నారు. జలమండలి కేసులోనూ గతంలో ఇలాంటి అనుభవాలే వెలుగుచూశాయి.

అవినీతి అధికారులు తమ సంపాదనను కేవలం నగదు రూపంలో కాకుండా, ఇతర దేశాల్లో పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీ లేదా సుదూర ప్రాంతాల్లో బినామీల పేరుతో భూములుగా మారుస్తున్నారు. ఏసీబీ వద్ద ఉన్న పాత తరం దర్యాప్తు పద్ధతులు ఈ ఆధునిక వైట్ కాలర్ నేరాలను ఛేదించలేకపోతున్నాయి. ఫోరెన్సిక్ ఆడిటింగ్ మరియు డిజిటల్ ఎవిడెన్స్ సేకరణలో ఏసీబీ బలోపేతం కాకపోవడం వల్ల, కోర్టుల్లో నిందితుల తరపు న్యాయవాదులు సాంకేతిక కారణాలతో కేసులను కొట్టివేయించగలుగుతున్నారు. దీనివల్ల పట్టుబడటం అనేది ఒక చిన్న ప్రమాదం మాత్రమే, శిక్ష పడటం అసాధ్యం అనే భావన అవినీతి తిమింగలాల్లో బలపడింది. ఏసీబీ కేవలం దాడుల నాటి హంగామాకే పరిమితం కాకుండా, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా ఏడాది లోపే నిందితుల ఆస్తులను జప్తు చేసే అధికారాలను పొందాలి. పట్టుబడిన వెంటనే ఆస్తులను ప్రభుత్వ పరం చేసే విధానం వస్తేనే భయం మొదలవుతుంది. ఏసీబీకి స్వయంప్రతిపత్తి కల్పించడంతో పాటు, ప్రాసిక్యూషన్ విభాగాన్ని అత్యున్నత స్థాయి న్యాయ నిపుణులతో బలోపేతం చేయాలి. అప్పుడే, లక్షల్లో జీతం ఉండి కోట్లలో ఆస్తులు కూడబెట్టే అధికారుల అక్రమ దాహానికి బ్రేకులు పడతాయన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# ఫ్యూచర్ సిటీ పెట్టుబడులకు స్వర్గధామం: పట్నం మహేందర్ రెడ్డి

## ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లలా ముందుకు సాగుతున్నాయి



**రంగారెడ్డి, సమయం ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా, శుక్రవారం ఫ్యూచర్ సిటీ ప్రపంచ పెట్టుబడులకు స్వర్గధామంగా నిలుస్తుందని, ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లలా ముందుకు సాగుతున్నాయని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలుకు ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం దోహదపడుతోందని తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి ప్రజలతో కలిసి బీపీ పరీక్ష చేయించుకున్నారు. అనంతరం రాష్ట్ర గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభమై, ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు.

ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి-సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. గత రెండేళ్లలో రంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి వేగంగా జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో 2 లక్షల 97 వేల మంది రైతులకు రూ.722 కోట్ల రైతు భరోసా అందించామని, రైతు బీమా కింద 735 కుటుంబాలకు ఆర్థిక సహాయం చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద వేలాది గృహాలు మంజూరు చేసి నిధులు విడుదల చేశామని చెప్పారు. లక్షకు పైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయగా, ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ చీరలు, మహిళల ఉచిత బస్సు ప్రయాణం ద్వారా లక్షలాది మందికి ప్రయోజనం చేకూరుతోందని వివరించారు.

ఫ్యూచర్ సిటీపై అనవసర ఆరోపణలు చేయడం సరికాదని, భవిష్యత్తులో తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా నిలబెట్టే ప్రాజెక్టుగా అది మారుతుందని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో సమీక్షలు నిర్వహించి సంక్షేమ పథకాల అమలును వేగవంతం చేస్తున్నామని తెలిపారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు, గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు రుణ సదుపాయాలు, రైతులకు మద్దతు ధరతో కొనుగోళ్లు కొనసాగుతున్నాయని చెప్పారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరా మహిళా శక్తి సంఘాలకు రుణాల చెక్కులు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ట్రాన్స్‌జెండర్ల ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేశారు.

## డెలివరీ పేరిట కాల్ ఫార్వర్డింగ్ మోసాలు..

**హైదరాబాద్ :** ఆన్‌లైన్ షాపర్లే టార్గెట్‌గా సైబర్ నేరగాళ్లు సరికొత్త పంథాలో విరుచుకుపడుతున్నారు. ఓటీపీలు చెప్పడం, లింకులు క్లిక్ చేయడం వంటి వాటిపై ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ నేరగాళ్లు మోసాలకు సరికొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం కొరియర్ డెలివరీల పేరిట, కాల్ ఫార్వర్డింగ్ కోడ్‌ల ద్వారా , ఉచితంగా ఫోన్లు పంపిస్తూ ప్రజల సొమ్మును దోచేస్తున్నట్లు సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.నేరగాళ్లు ప్రముఖ ఈ-కామర్స్ సంస్థల డెలివరీ బాయ్స్‌గా లేదా ప్రైవేటు కొరియర్ కంపెనీల ప్రతినిధులుగా ఫోన్ చేస్తారు. బాధితుల పేరు, చిరునామా ముందే సేకరించి, వాటిని సరిచూసుకుంటూ నమ్మిస్తారు. మీ పేరు మీద ఒక కొరియర్ వచ్చిందని, ఎలాంటి బుకింగ్ చేయలేదని చెబితే పొరపాటున వచ్చి ఉండొచ్చని నమ్మిస్తారు.ఆ ఆర్డర్‌ను రద్దు చేయడానికి లేదా చిరునామా ధృవీకరణ కోసం ఫోన్‌లో I21I ఫోన్ నంబరు హ్యాష్ (#) డయల్ చేయాలని కోరతారు. అలా డయల్ చేయగానే బాధితుల ఫోన్‌కు వచ్చే కాల్స్, ఓటీపీలు, వాట్సాప్ వెరిఫికేషన్ కోడ్‌లు పూర్తిగా సైబర్ నేరగాళ్లకు ఫార్వర్డ్ అయిపోతాయి. దీనిని ఆసరాగా చేసుకుని బ్యాంక్ ఖాతాల నుండి డబ్బును కాజేస్తున్నారు.టెలికాం శాఖ (డీవోటీ) లేదా వివిధ బ్యాంకుల క్రెడిట్ కార్డు విభాగం ప్రతినిధులమంటూ ఫోన్ చేసి, సిమ్ కార్డు తనిఖీ చేసుకోకపోతే సేవలు నిలిచిపోతాయని బెదిరిస్తారు. తనిఖీ కోసం అడిగితే నేరుగా ఇంటికే కొరియర్ ద్వారా ఒక ఫోన్‌ను పంపిస్తారు. ఆ ఫోన్లలో ముందస్తుగానే ప్రమాదకరమైన మాల్వేర్‌ను ఇన్‌స్టాల్ చేసి ఉంచుతారు. బాధితులు ఆ ఫోన్లలో తమ సిమ్ కార్డు వేయగానే బ్యాంకింగ్ ఓటీపీలన్నీ నేరగాళ్లకు చేరిపోతాయి. ఇలా ఢిల్లీ, చెన్నై, బెంగళూరు నగరాల్లో భారీ మోసాలకు పాల్పడ్డారు. ఢిల్లీ నుండి వచ్చిన ఒక ఫోన్‌లో సిమ్ కార్డు వేయగానే ఒక బాధితుడు ఏకంగా 77 లక్షల రూపాయలు కోల్పోవడం గమనార్హం.మనం బుక్ చేయకుండా కొరియర్ ద్వారా ఏదైనా వస్తువు లేదా ఫోన్ వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్ స్పష్టం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులతో ఫోన్లలో బ్యాంకింగ్ వివరాలు పంచుకోవద్దని, ఆర్డర్ లేదా తనిఖీల పేరిట వచ్చే అనుమానాస్పద కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలను కోరారు.

## మణుగూరు-రామగుండం రైల్వే లైన్

**కరీంనగర్ :** రామగుండంలో రైలు ఎక్కి మేడారంలో మొక్కులు చెల్లించుకొని, ఆ తర్వాత భద్రాచలంలో రైలు దిగి రాముణ్ని దర్శించుకుంటే..? భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) స్టేషన్లో రైలు ఎక్కి విశాఖపట్నంలో దిగి బీచ్‌లో ఎంజాయ్ చేసి.. మళ్లీ భద్రాచలం రోడ్ మీదుగానే రామగుండం వెళ్లిపోతే..? ఊహ భలే ఉంది కదా. కొత్తగా ఏర్పాటు కానున్న రామగుండం-మణుగూరు రైల్వే లైన్‌తోపాటు.. ఇప్పటికే రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన భద్రాచలం రోడ్-కొవ్వూరు రైల్వే లైన్ ఏర్పాటయితే ఈ కల త్వరలోనే సాకారం కానుంది.తెలంగాణలో మరో కొత్త రైల్వే మార్గం అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు, పారిశ్రామిక కేంద్రాలను కలుపుతూ కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కానుంది. మణుగూరు-రామగుండం కొత్త రైలు మార్గాన్ని ఐదేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.5818.45 కోట్లు ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును పబ్లిక్-ప్రయివేట్ భాగస్వామ్యంలో పూర్తి చేయనున్నారు. 207.8 కిలోమీటర్ల పొడవైన ఈ రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే.. మణుగూరు-రామగుండం మధ్య 90 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ప్రస్తుతం మణుగూరు నుంచి రామగుండం వెళ్లడానికి భద్రాచలం రోడ్, కాజీపేట మీదుగా చుట్టూ తిరుగుతూ ప్రయాణించాల్సి వస్తోంది.కొత్త రైల్వే అందుబాటులోకి వస్తే భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, పెద్దపల్లి జిల్లాల్లోని మారుమూల గిరిజన ప్రాంతాలకు రైలు సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. గిరిజనుల అతిపెద్ద జాతర జరిగే మేడారం ప్రాంతానికి రైలులో వెళ్లొచ్చు. మంథని, భూపాలపల్లి, మేడారం, తాడ్వాయి, గోపాలరావుపేట మీదుగా ఈ రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ రైలు మార్గం న్యూఢిల్లీ-చెన్నై మార్గంలోని విజయవాడ-నాగ్‌పూర్ సెక్షన్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది.ప్రజా రవాణాతోపాటు బొగ్గు, ఎరువులు, ఆహార ధాన్యాలు, ఖనిజాల ఎగుమతులకు ఈ రైల్వే మార్గం కీలకం కానుంది. పెద్దపల్లి, ములుగు జిల్లా ప్రజలు మేడారం, భద్రాచలం లాంటి ఆధ్యాత్మిక పర్యాటక ప్రదేశాలకు తక్కువ ఖర్చుతో, సౌకర్యవంతంగా వెళ్లడానికి వీలవుతుంది.ఏడాదిలోగా భూసేకరణ చేపట్టాలని.. మరో నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. భూసేకరణ, అనుమతులు, డీపీఆర్ రూపకల్పన లాంటి పనులను రైల్వే శాఖ చూసుకుంటుంది. రైలు మార్గం నిర్మాణం, నిధుల సమీకరణతోపాటు 45 ఏళ్లపాటు ఈ రైలు మార్గ నిర్వహణ బాధ్యతను ప్రయివేట్ సంస్థకు అప్పగిస్తారు. రైల్వే శాఖ పీపీపీ మోడల్‌కు సంబంధించి ప్రతిపాదనలను రూపొందించిన తర్వాత టెండర్లను ప్రారంభిస్తారు. ఈ కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే.. మారుమూల గిరిజన ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. భద్రాచలం నుంచి రామగుండం చేరుకోవడం సులభం అవుతుంది. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి భద్రాచలం-పాండురంగాపురం వరకు 186 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్‌కు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ లైన్‌కు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తయ్యింది. అలాగే భద్రాచలం రోడ్ (కొత్తగూడెం), డోర్నకల్ స్టేషన్ల మధ్య డబుల్ లైన్ పనులు జరుగుతున్నాయి.

## ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవద్దు: సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా కలెక్టర్‌కు వినతిపత్రం

### భూమి కేటాయిస్తే రాజీనామాలకు సిద్ధం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరిక



**రంగారెడ్డి, సమయం ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి సమావేశంలో సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశం చర్చనీయాంశమైంది. కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల్లోనూ భూమి కేటాయించవద్దని డిమాండ్ చేస్తూ కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ ఆధ్వర్యంలో మండల సర్పంచులు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమక్షంలో స్థానిక ప్రజాప్రతినిధులు తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా అధికారులు నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రజల అభీష్టానుసారమే వ్యవహరించాలని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్ అంశంపై స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి భూమి కేటాయిస్తే తామంతా రాజీనామాలకు కూడా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సిద్ధాపూర్ పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు.

## ఏడుపాయల.... అవస్థల పాలిలా..

**మెదక్ :** పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది ఏడుపాయల పరిస్థితి. పాలకవర్గం లేకపోవడంతో కూడా వసతులను పట్టించుకునే వారు కరవయ్యారని చెప్పవచ్చు. ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా పొరుగు జిల్లాలు, ప్రధానంగా జంట నగరాల నుంచి, పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాదిభక్తులు ఏడుపాయల వన దుర్గామాత దర్శనానికి తరలి వస్తారు.దేశంలోనే రెండో వనదుర్గా మాత ఆలయం. రాష్ట్రవ్యాప్త గుర్తింపు ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గామాత ఆలయం. జంటనగర వాసులు, పొరుగు రాష్ట్రాల వారిని ఆకర్షిస్తున్న పర్యాటక కేంద్రం. ఏడాది పొడవునా భక్తులతో కిటకిటలాడే ప్రాంగణం. ఏటా రూ. కోట్లలో సమకూరే ఆదాయం. అలాగైతే అక్కడ అన్ని వసతులు బాగుంటాయని, సందర్శకులకు ఏ ఇబ్బంది ఉండదని అనుకుంటే మాత్రం పొరపడినట్లే.వచ్చిన భక్తులు మంజీరా నదీపాయల్లో పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. నది పాయల్లో ఉన్న నీరు ఎక్కువ రోజులు కావడంతో కలుషితమయ్యాయి. దీంతో చేసేదేమీ లేక భక్తులు ఆ మురుగునీటిలోనే స్నానాలు ఆచరిస్తున్నారు. జల్లు స్నానాలు ఏర్పాటు చేస్తే కొంతమేర ఉపశమనం ఉన్నా అధికారులు ఆ ఆలోచన కూడా చేయడం లేదని భక్తులు మండిపడుతున్నారు. అంతేగాక ఆ నీటిలోనే పాత దుస్తులు, చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధభరితంగా మారింది. ముఖ్యంగా పుణ్య స్థానమాచరించిన అనంతరం మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదులు లేకపోవడంతో వారు అసౌకర్యానికి గురవుతున్నారు. శౌచాలయాలు నిర్మించి వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాఘ అమావాస్య, మహాశివరాత్రి పర్వదినాన నిర్వహించే జాతర ఉత్సవాలకు తాత్కాలికంగా మరుగుదొడ్లు నిర్మించి చేతులు దులుపుకుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏడుపాయల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.సమస్యలను గుర్తించి, పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తాం. మహిళలు దుస్తులు మార్చుకునే రేకుల గదులను స్నాన ఘట్టాల వద్ద ఏర్పాటు చేస్తాం. జల్లు స్నానాలు, మరుగుదొడ్లను సైతం వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతాం. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

## ల్యాండ్ బ్యాంక్ ఎక్కడ...

**హైదరాబాద్ :** ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఉద్దేశించిన 'ల్యాండ్‌బ్యాంక్' యాప్ రూపకల్పనలో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ భూముల వివరాలన్నింటినీ ఒకే చోట భద్రపరిచేందుకు రెండేళ్ల క్రితమే ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ యాప్ బాధ్యతలను తొలుత సీజీజీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) కి అప్పగించినప్పటికీ, ఆ తర్వాత మరో సంస్థ ఈ ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తామని ముందుకు వచ్చింది.ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలాలు, క్వార్టర్స్, వివిధ శాఖలకు కేటాయించిన భూములు, అలాగే కోర్టు వివాదాల్లో ఉన్న స్థలాల వివరాలను యాప్‌లో పొందుపరిచే ప్రక్రియ ఏడాది క్రితమే ప్రారంభమైనప్పటికీ ఇప్పటికీ పూర్తి కాలేదు. హైదరాబాద్‌లో ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కూడా అమలు చేయాలని భావించినా, యాప్ ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది.ప్రభుత్వ భూములను యాప్‌లో నమోదు చేసే సమయంలో బహుభుజి, జియో కోఆర్డినేట్ల పద్ధతిని ఉపయోగించాలని నిపుణులు సూచించారు.

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, RANGA REDDY DISTRICT. TG., AT PRASHANTH NAGAR, KUKATPALLY, HYDERABAD**
**DISPUTE NO. 305 OF 2025.**
**BETWEEN :**
**M/S. MARGADARSI CHIT FUND PVT, LTD,**
MADHAPUR BRANCH
.....DISPUTANT
AND
1) **MR. VOLLALA ASHOK & OTHERS**
TO, ....OPPONENTS

**OPPONENT NO.01**
1) VOLLALA ASHOK, S/O LATE V. RAJAIAH, DOB: 15.06.1984, W/AS: SENIOR SPECIALIST, EMP. CODE NO. 52161345, M/S. HCL TECH LTD, JIGANI INDUSTRIAL AREA, BOMMA SANDRA, JIGANI LINK ROAD, BANGALORE, KARNATAKA - 562106, R/O PLOT NO.17, SATYANARAYANASWAMY COLONY, KPHB, HYDERABAD-72.

**OPPONENT NO.02**
2) MR VOLLALA SRINIVAS, S/O LATE RAJAIAH, DOB:01.06.1980, W/AS: TEAM LEADER-DEVELOPMENT, EMP. CODE NO.46, M/S. DAVIS SOFTWARE SOLUTIONS PVT. LTD, 4TH FLOOR, CSR COMMERCIAL, PLOT NO.40, # 2-56/33/40, KHANAMET, 100 FT ROAD, MADHAPUR, HYDERABAD-81. R/O PLOT NO.313, VASANTH NAGAR, KPHB, HYD-72.

**OPPONENT NO.03**
3) MR. SIRIMALLA RAJASHEKAR, S/O S. RAJENDER, DOB: 30.07.1987, W/AS: SENIOR SOFTWARE ENGINEER, EMP CODE NO.CBHYD316, M/S. INTELLECT INFORMATIC (P) LTD, PLOT NO.34, # 8-2-269/N/34, SAGAR SOCIETY, ROAD NO.2, BANJARA HILLS, HYDERABAD-34. R/O. H.NO.13-1-130/2, FLAT NO.202, SHEHAPURI COLONY, MOTHINAGAR, BORABANDA, HYDERABAD-18.

**OPPONENT NO.04**
4) MR.RAMA RAJESH, S/O R. NARENDER, DOB: 06.02.1973, W/AS: POLICE CONSTABLE, EMP. CODE NO. 2112490, NALLABELLI POLICE STATION, NARSAMPET, WARANGAL DISTRICT-506350. R/O H.NO.10-8-144, GIRMAJIPET, WARANGAL DISTRICT-506002.

PLEASE TAKE NOTICE THAT THE ABOVE DISPUTE IS FILED AGAINST YOU FOR RECOVERY OF **RS. 4,72,468/- (RUPEES FOUR LAKHS SEVENTY TWO THOUSAND FOUR HUNDRED AND SIXTY EIGHT ONLY)** AND THE SAME IS POSTED TO **09/06/2026** FOR YOUR APPEARANCE BEFORE THE OFFICE OF DEPUTY REGISTRARAR OF CHITS/ ARBITRATOR, **RANGAREDDY DIST,T.G. (AT PRASHANTH NAGAR, KUKATPALLY, HYD) AT 12.00 P.M.** IF YOU FAIL TO ATTEND THE OFFICE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR ON THAT DAY THE MATTER WILL BE HEARD AND DECIDED EXPARTE.

**(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR)**

BRANCH MANAGER
MADHAPUR BRANCH

# అధికారులు బాధ్యతాయుతంగా ప్రజల అర్జీలని సత్వరం పరిష్కరించి న్యాయం చేయాలి, అదే ప్రజాపాలనకు నిజమైన అర్థం

-రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.

-వనపర్తి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం.

-వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి.

-వనపర్తి కలెక్టరేట్లో ఘనంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లాస్థాయి కార్యక్రమం





వనపర్తి. సమయం ప్రతినిధి: దళారీ వ్యవస్థ అనేది సమూలంగా లేకుండా చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల అర్జీలపై నిర్లక్ష్యం వద్దని, వేగంగా పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరం నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితోపాటు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఉన్నారు. కార్యక్రమానికి ముందుగా తెలంగాణ గీతాన్ని ఆలపించి, సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని చదివి వినిపించారు. అనంతరం వనపర్తి నియోజకవర్గంలో ప్రజా ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను లబ్ధి పొందుతున్న వారి వివరాలను తెలియజేసారు.మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలకు తోడుగా అదనంగా మరిన్ని పథకాలను ప్రజలకు అందిస్తుందని తెలిపారు. విద్యా వైద్యంపై ప్రధాన దృష్టి సారించి, వీటికి ప్రధానంగా నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. ప్రజల అర్జీలను, దరఖాస్తులను వేగంగా పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. దళారీ వ్యవస్థ అనేది సమూలంగా లేకుండా చేయాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల అర్జీలపై నిర్లక్ష్యం వద్దని, వాటిని వేగంగా పరిష్కరించాలని తెలిపారు. ఎటువంటి సమస్య లేకుండా భూభారతికి సంబంధించి రైతుల నుంచి వచ్చే అర్జీలను శరవేగంగా పరిష్కరించాలని సూచించారు. ఇక ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు పరిమితులకు లోబడి ఇండ్లను నిర్మించుకోవాలని, పరిమితికి మించి ఇండ్ల నిర్మాణం చేసుకోవడం ద్వారా తిరిగి అప్పులపాలయ్యే అవకాశం ఉంటుందని ఆ దిశగా అధికారులు పర్యవేక్షణ సాగించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై ప్రతి వ్యక్తికి సరైన సమాచారం అందాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో 65 ఏళ్లలో కేవలం రాష్ట్ర అప్పు రూ. 65 వేల కోట్లు ఉంటే, గత ప్రభుత్వం పది ఏళ్లలో 8 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వాటిని నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. యువత పక్కదారి పట్టకుండా, డ్రగ్స్ వైపు మల్లకుండా క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లలో ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేసిందని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను చేరువ చేయడంలో బాగా పనిచేస్తున్న అధికారులకు ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. పాలమూరు బిడ్డ రేవంత్ రెడ్డి సీఎంగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటి సంతకం మహిళా శక్తి పథకంపై చేశారని తెలిపారు. తద్వారా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పదివేల కోట్ల రూపాయలు మహిళా శక్తి పథకం కోసం మహిళల ప్రయాణం కోసం ఖర్చుపెట్టిందన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటును గృహ జ్యోతి పథకం కింద ప్రభుత్వం పేదలకు అందించి పేదలకు కరెంటు కష్టాలు తీర్చిందని తెలిపారు. అదేవిధంగా గత పది సంవత్సరాలలో ఎన్నడూ ఒక రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని, రేవంతన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత వనపర్తి జిల్లాలో 73 వేల కొత్త రేషన్ కార్డులను అందించామని తెలిపారు. రైతు భరోసా పెట్టుబడి సాయం కింద గతంలో ఎకరాకు పదివేల రూపాయలు ఇస్తే, ఇప్పుడు దాన్ని ఎకరాకు 12 వేల రూపాయలకు పెంచామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో 15 బస్సులు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాటు బాధ్యతలు మహిళలకు అప్పజెప్పడం జరిగిందన్నారు. వనపర్తి నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఒక్క పూరి కూడా లేకుండా ప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు ఉండాలని లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని, తద్వారా పేదల సొంతయింటి కల నెరవేరుస్తోందని తెలిపారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు లక్ష ఇండ్ల గృహ నిర్మాణాలతో చరిత్ర సృష్టించబోతున్నామని తెలిపారు. వనపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ పరిధిలో రహదారుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వనపర్తి లో 70 కోట్ల రూపాయలతో అందరికీ మంచినీటి సౌకర్యం అందించేందుకు పనులు జరుగుతున్నాయని తెలిపారు. 47 కోట్ల రూపాయలతో వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మరియు జూనియర్ కళాశాలల భవన నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా సమాఖ్య భవన నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. సరికొత్త వనపర్తి జిల్లా హాస్పిటల్ నిర్మాణం కొరకు 203 కోట్ల రూపాయలతో పనులు శరవేగంగా ముందుకు వెళ్తున్నాయని తెలిపారు. అదేవిధంగా యూనియన్ బ్యాంక్ సి ఎస్ ఆర్ నిధులతో వనపర్తి జిల్లా ఆసుపత్రిలో రెండున్నర కోట్ల రూపాయలతో సిటీ స్కాన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేందుకు ఎల్పిజి కనెక్షన్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేసి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం విస్తృతంగా చర్యలు చేపట్టిందని, రైతు భరోసా, పంటల కొనుగోలు వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు రుణ మాఫీ పథకం ద్వారా 61,687 మంది రైతులకు రూ.491 కోట్ల లబ్ది చేకూర్చడం జరిగింది అన్నారు. రైతు భరోసా కింద 1,83,839 మంది రైతులకు రూ. 140 కోట్ల పెట్టుబడి సాయం అందించమన్నారు. 2025-26 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 50,585 మంది రైతుల నుంచి ధాన్యం సేకరించి వారి ఖాతాల్లో నగదు వేసినట్లు తెలిపారు. వనపర్తి జిల్లాలో 1,82,262 రేషన్ కార్డులు ఉండగా వాటిలో 73,214 కార్డులు ప్రజా ప్రభుత్వం లో కొత్తగా జారీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 84,830 లబ్ధిదారులకు గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించి కరెంటు బిల్లుల భారం తగ్గించిందాన్నారు. అదేవిధంగా జిల్లాలో మొత్తం 6,094 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి సొంతం ఇంటి కల నెరవేర్చమన్నారు. జిల్లాలో మొత్తం 8,258 స్వయం సహాయక సంఘాలకు రూ.28 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మహిళలకు 97,076 ఏక రూప చీరలు, 70,516 మందికి చేయూత పెన్షన్ లు అందించడం జరిగిందన్నారు. విద్యాశాఖ పై ప్రత్యేక చొరవ తీసుకున్న ప్రభుత్వం గతేడాదితో పోలిస్తే పదో తరగతి ఫలితాల్లో మెరుగైన స్థానాన్ని సాధించిందని తెలిపారు. 97% ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 19వ స్థానాన్ని సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా బాల భరోసా కార్యక్రమం కింద జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ల సంయుక్త ఆధ్వర్యంలో 16 మంది చిన్నారులకు వినికిడి పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం వనపర్తి, చిన్నంబావి మండలాలకు చెందిన మహిళా సమాఖ్యలకు ఇందిరా మహిళా శక్తి కింద బస్సులను అందజేశారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పలువురు రైతులకు పచ్చిరొట్ట, జీలుగా విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్, ఫోటో ప్రదర్శనల్ని ముఖ్య అతిథులు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం ఛైర్మెన్ గోవర్ధన్ సాగర్, వనపర్తి మున్సిపాలిటీ ఛైర్పర్సన్ మాధవి, పెబ్బేరు మునిసిపల్ ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కొత్తకోట మునిసిపల్ ఛైర్పర్సన్ అరుణ, ఆత్మకూరు మునిసిపల్ ఛైర్పర్సన్ నాగమణి, అమరచింత మునిసిపల్ ఛైర్పర్సన్ సువర్ణ, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ శ్రీనివాస్ గౌడ్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రెండు ప్యాకేజీలుగా రీజినల్ రింగ్ రోడ్డు

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం కేంద్రం సహకారంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో కీలక ముందడుగుపడింది. కేంద్రం ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.. 5 ప్యాకేజీలను 2 ప్యాకేజీలుగా కుదించి వేర్వేరుగా ఎన్‌హెచ్ఏఐ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ రీజినల్ రింగ్ రోడ్డు మొత్తం 161.518 కిలోమీటర్లు ఆరు వరుసలుగా రూ.9,362.4 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఈ రీజినల్ రింగ్ రోడ్డు టెండర్లకు సంబంధించి జులై 7వ తేదీ ఉదయం 11 గంటల వరకు గడువు ఉంది.. ఆలోపు ఆన్‌లైన్‌లో బిడ్‌లను సమర్పించాలని అధికారులు సూచించారు. ఆ మరుసటి రోజు బిడ్‌లు తెరుస్తారు. డిజైన్, బిల్ట్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన ఈ ఆర్ఆర్ఆర్ పనులు చేపట్టాల్సి ఉంటుందని ఎన్‌హెచ్ఏఐ నోటిఫికేషన్‌లో తెలిపింది.ఈ ఆర్ఆర్ఆర్ సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్‌లో మొదలై.. యాదాద్రి భువనగిరి జిల్లా తంగడ్‌పల్లి దగ్గర ముగుస్తుంది. ప్యాకేజీ 1లో 83.518 కిలోమీటర్లు పొడవున సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్ నుంచి సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ వరకు రూ.4,918.71 కోట్లు వ్యయంగా అంచనా వేస్తున్నారు. ప్యాకేజీ 2లో మొత్తం 78 కిలోమీటర్లు కాగా.. రూ.4,443.69 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇప్పటికే ప్యాకేజీ-1, ప్యాకేజీ-2లో భూమిని సేకరించారు. ఈ ఖీఖీఖీలో 9చోట్ల నేషనల్ హైవేలు, స్టేట్ హైవేలు కనెక్ట్ అవుతాయి. 9 టోల్‌ప్లాజాలా?, 44 పెద్ద బ్రిడ్జిలు, 127 చిన్న బ్రిడ్జిలు, 44 అండర్ పాస్‌లు, 4 ఆర్వోబీలు రానున్నాయి.రెండేళ్లుగా ఆర్ఆర్ఆఱ్ ఉత్తర భాగం పనులు వాయిదాపడుతున్నాయి. 2024 డిసెంబర్‌లో రీజినల్ రింగ్ రోడ్డును 4 వరుసలుగా ఐదు ప్యాకేజీలలో నిర్మించేందుకు టెండర్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

## అల్లాడుతున్న ఉత్తర తెలంగాణ

అదిలాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో భానుడు భగభగలాడుతున్నాడు. గత కొన్ని రోజులుగా పెరుగుతున్న ఎండల తీవ్రత ప్రస్తుతం పతాక స్థాయికి చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 డిగ్రీల వరకు అధికంగా నమోదు అవుతుండటంతో జనం ఇబ్బంది పడుతున్నారు. పరిస్థితి తీవ్రతను గమనించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేస్తూ హెచ్చరికలు చేసింది. రాష్ట్రంలో మంగళవారం నాటి వాతావరణ గణాంకాలు భయం గొల్పుతున్నాయి. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల ఐలాపూర్‌లో 45.9 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎండల తీవ్రత చాలా ముందుగానే పెరిగింది. 2025 మే 19న రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత 41.9 డిగ్రీలు ఉండగా, ఈ ఏడాది అదే సమయానికి 45.9 డిగ్రీలకు చేరుకోవడం వాతావరణ మార్పుల తీవ్రతకు అద్దం పడుతోంది. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల వంటి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాలుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు మార్కును దాటేశాయి. హైదరాబాద్‌లో వేడి తీవ్రం 43 డిగ్రీలుగా నమోదు అయ్యింది. తీవ్రమైన ఎండల కారణంగా రాష్ట్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మంగళవారం వడ దెబ్బకు గురైన నలుగురు వ్యక్తులు మరణించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరుకు చెందిన రాచర్ల రాజు అనే రైతు మరణించాడు. వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం అంతారానికి చెందిన శామ్యూల్ అనే కార్మికుడు, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం మత్తడిగూడకు చెందిన లచ్చు అనే వృద్ధురాలు, శాంతినగర్‌కు చెందిన బిరుదుల కిరణ్ కుమార్ వడదెబ్బకు ప్రాణాలు వదిలేశారు. గాలిలో తేమ శాతం గణనీయంగా పడిపోవడం ఈ తీవ్రమైన వేడికి ప్రధాన కారణంగా వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా గాలిలో తేమ 50 శాతం లోపు మాత్రమే ఉంటోంది. సాధారణంగా రాత్రివేళల్లో వచ్చే చల్లని గాలులు కూడా ఇప్పుడు వీయకపోవడం వల్ల రాత్రిపూట కూడా ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరాల్లో కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వేడి ప్రభావం మరింత ఎక్కువగా ఉంటోంది. రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు 46 నుంచి 47 డిగ్రీల మధ్య నమోదు అయ్యే ఛాన్స్ ఉండటంతో వాతావరణ శాఖ కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, వరంగల్, హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల. ఈ ప్రాంతాల్లో మధ్యాహ్నం వేళ జనం బయటకు రావడం ప్రాణాపాయమని అధికారులు హెచ్చరించారు. ఒకవైపు ఎండలు మండుతుంటే, మరోవైపు మంగళవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గాలి వాన బీభత్సం సృష్టించింది. మెదక్, సిద్ధిపేట జిల్లాల్లో అకాల వర్షం కురిసింది. భారీగా వీచిన గాలులు కారణంగా చెట్లు విరిగిపడం, ఇళ్ల రేకులు ఎగిరిపోవడం జరిగింది. కొన్ని ప్రాంతాల్లో ఆస్తి నష్టం పంట నష్టం కూడా జరిగింది. రానున్న 3-4 రోజుల పాటు ఈ ఎండల తీవ్రత ఇలాగే కొనసాగే అవకాశం ఉంది. అందుకే ప్రజలు ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ క్షేమంగా ఉండాలని సూచిస్తున్నారు.

**ఒక వైపు ఎండ.. మరో వైపు ఉక్కపోత..**

సూర్యభగవానుడు నరసింహా అవతారమెత్తాడు.. ప్రజలపై సూర్యాగ్రరూపం చూపిస్తున్నాడు.. మునుపెన్నడూ లేని విధంగా భూమి పై ఆక్రోశంతో అగ్నిఘోలం చూపిస్తున్నట్లు మంటలు మండిస్తున్నాడు.. ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువ ఈ ఏడాది బానుడు భగభగమండిపోతున్నాడు. గత నాలుగు రోజులుగా భానుడి ప్రతాపానికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. దీంతో తెల్లవారుజామున నుంచి ఎండ తన ప్రభావం చూపిస్తోంది. మధ్యాహ్నం 12గంటల నుంచి అగ్ని గోళంను తలపిస్తోంది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఎండలు మండిపోతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 48డిగ్రీల ఉష్ణోగ్రతలతో బానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గతేడాది 40డిగ్రీలతో ఆగిపోయిన ఎండలు, ఈ ఏడాది ఉగ్ర రూపాన్ని చూపిస్తున్నాయి. ఖమ్మం పట్టణం లో 44 డిగ్రీల నుండి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదవుతుంది.ఒక వైపు ఎండ, మరో వైపు ఉక్కపోత ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయం 7గంటల నుంచి రాత్రి 6గంటల వరకు ఎండు తీవ్రత ఎక్కువగా ఉండగా, 24గంటల పాటు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోజంతా చెమటలతో అల్లాడిపోతున్నారు. ప్రజలు, చిరు వ్యాపారులు, ముఖ్యంగా డ్రైవర్లు బెంబెలెత్తుతున్నారు. ఎండు, ఉక్కపోతకు కూలర్లు, ఏసీలు పనిచేయడం లేదు. ఎండ తీవ్రతకు ప్రజలు వణికిపోతున్నారు. ఉదయం 10 గంటలకు రోడ్లు కాళీ అవుతున్నవి. వీధి వ్యాపారాలు వారి వారి వ్యాపారాన్ని బంద్ చేసి, వారి వ్యాపార సామాగ్రికి జాబు కాగితాలతో కప్పి ఇళ్లకు వెళ్తున్నారు. రోడ్లన్నీ 10 గంటలకే ఖాళీ అవుతుండటముతో కొన్ని షాప్ ల వారు కూడా 11 గంటలకు షాప్ లను బంద్ చేసి ఇంటికి వెళ్తున్నారు. చిన్న పిల్లలు, పెద్ద వారు ఈ వేడి గాలులకు, ఊక్క పోతకి తట్టుకోలేక పోతున్నారు.సాయంత్రం 7 గంటలకు కూడా వేడి గాలులు తగ్గడం లేదు.




మొదటి పేజీ తరువాయి

ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026లో భాగంగా ఉప్పల్ వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. టాస్ నెగ్గిన సన్‌రైజర్స్.. బ్యాటింగ్ ఎంచుకుంది. దీంతో ఆర్సీబీ తొలుత ఫీల్డింగ్ చేయనుంది. ఆర్సీబీ 18 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ పోరులో నెగ్గితే 20 పాయింట్లతో క్వాలిఫయర్‌కి చేరుకుంటుంది. ఇదిలా ఉంటే సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 16 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో ఓడినా, గెలిచినా స్థానం ఏమీ మారదు. ఒకవేళ భారీ మార్జిన్ తేడాతో విజయం సాధిస్తేనే టాప్ 2లోకి వెళ్లే అవకాశం ఉంటుంది.

ఆర్సీబీ తుది జట్టు

రజత్ పాటీదార్(కెప్టెన్), విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, వెంకటేశ్ అయ్యర్, జితేశ్ శర్మ(వికెట్ కీపర్), కృనాల్ పాండ్య, రోమారియో షెఫర్డ్, భువనేశ్వర్ కుమార్, హేజిల్‌వుడ్, సుయాశ్ శర్మ, రసిక్ సలామ్ దార్

ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: టిమ్ డేవిడ్, కనిష్క్ చౌహాన్, స్వప్నిల్ సింగ్, అభినందన్ సింగ్, కాక్స్

ఎస్ఆర్‌హెచ్ తుది జట్టు

ప్యాట్ కమిన్స్(కెప్టెన్), అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), క్లాసెన్, సలీల్ అరోరా, స్మరన్ రవిచంద్రన్, నితీశ్ కుమార్ రెడ్డి, శివాంగ్ కుమార్, ఎషాన్ మలింగ, సాకిబ్ హుస్సేన్

ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: ప్రఫుల్ హింగే, అనికేత్ వర్మ, లివింగ్‌స్టోన్, హర్ష్ దూబె, హర్షల్ పటేల్




ఇంటర్నెట్ డెస్క్: హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం దగ్గర బ్లాక్‌లో ఐపీఎల్ టికెట్ల దందా కలకలం రేపింది. బహిరంగంగానే స్టేడియం బయట తిరుగుతూ బ్లాక్‌లో ఐపీఎల్ మ్యాచ్ కాంప్లిమెంటరీ టికెట్లు విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణ అనంతరం వారిని ఉప్పల్ పోలీసులకు అప్పగించారు. ఐపీఎల్ మ్యాచ్‌కు ఉన్న క్రేజ్‌ను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమ మార్గాల్లో లాభాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో సీపీ సుమతి ఆదేశాలతో బ్లాక్ టికెట్లపై ఉప్పల్ పోలీసులు దృష్టి సారించారు.

ఐపీఎల్ 2026లో భాగంగా నేడు హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. ఎస్ఆర్‌హెచ్‌కు ఇది చివరి లీగ్ మ్యాచ్. దీంతో ఐపీఎల్ టికెట్ల కోసం అభిమానులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇదే చివరి లీగ్ మ్యాచ్ కావడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం కూడా ఐపీఎల్ టికెట్ల ధరలను భారీగా పెంచింది. రూ.950 టికెట్ ధరను రూ.2 వేలకు, రూ.1500 టికెట్‌ను రూ.3వేలకు, రూ.1910 టికెట్‌ను రూ.3,500కు, రూ.2,500 టికెట్ ధరను రూ.4,500కు, రూ.7 వేల టికెట్‌ను రూ.10 వేలకు, రూ.23 వేల బాక్స్ టికెట్ ధరను రూ.30 వేలకు పెంచారు. అంత ధరలు పెట్టలేక, మ్యాచ్‌ను స్టేడియంలో చూసేందుకు ప్రయత్నిస్తోన్న అభిమానులను ఆసరాగా చేసుకుని బ్లాక్‌లో టికెట్లు విక్రయిస్తున్న ముఠాను పోలీసులు గుర్తించారు. అభిమానులు టికెట్ల కొనుగోలు విషయంలో జాగ్రత్తగా ఉండాలని, అనధికార వ్యక్తుల నుంచి టికెట్లు కొనుగోలు చేయవద్దని సూచించారు.




ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్ హాకీ జట్టు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్.. ప్లేయర్లకు నిధులు సమకూర్చకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పెండింగ్ బకాయిల కోసం ఎదురుచూస్తోన్న వేళ.. పాక్ హాకీ ప్లేయర్లకు మరో షాక్ తగిలింది. హాకీ ప్రపంచ కప్ 2026 సమీపిస్తోన్న నేపథ్యంలో శిక్షణ శిబిరం రోజువారీ భత్యాన్ని భారీగా తగ్గించడం వివాదాస్పదంగా మారింది.

పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్(పీహెచ్ఎఫ్) ప్రాక్టీస్ సమయంలో ఆటగాళ్లకు ఇచ్చే రోజువారీ భత్యాన్ని 3000 పాకిస్థాన్ రూపాయిల నుంచి 1000 పాకిస్థాన్ రూపాయిలకు తగ్గించింది. భారత కరెన్సీలో 1000 పాకిస్థాన్ రూపాయిల విలువ రూ.335 మాత్రమే. ఈ నిర్ణయంపై ప్లేయర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది తమకు ఘోర అవమానంగా భావిస్తున్నారు. అంతర్జాతీయ పర్యటన సమయంలో పాక్ ప్లేయర్లకు, సిబ్బందికి రోజుకు 110 డాలర్లు చెల్లిస్తామని పీహెచ్ఎఫ్ ప్రకటించింది. అయితే గతంలో ఇచ్చిన హామీలే అమలు కాలేదని, తమకు రావాల్సిన బకాయిలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయంటూ ప్లేయర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'గతంలో కూడా ఇలాంటి హామీలు ఇచ్చారు. కానీ అమలు చేయలేదు. ఇప్పుడు నిజంగా ఇస్తారో? లేదో? తెలియదు. మాకు ఇవ్వాల్సిన డబ్బు ఇచ్చిన తర్వాతే పాక్ హాకీ ఫెడరేషన్‌ను నమ్ముతాం' అని ఓ ప్లేయర్లు పేర్కొన్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, ఆగస్టు 15 నుంచి హాకీ ప్రపంచ కప్ 2026 ప్రారంభం కానుంది. దీంట్లో భాగంగా జూన్ 13 నుంచి 27 వరకు హాకీ ప్రో లీగ్ పోటీలు జరగనున్నాయి. ఇందులో పాకిస్థాన్.. బెల్జియం, స్పెయిన్, ఇంగ్లండ్, భారత్‌తో తలపడనుంది. అనంతరం ప్రపంచ కప్ పోటీల్లో పాల్గొననుంది. అయితే దేశానికి ట్రోఫీని అందించేందుకు శ్రమించాల్సిన ప్లేయర్లు.. ఆర్థిక ఇబ్బందులపై పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.




ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ సంచలన ప్రదర్శనలతో అదరగొడుతున్నాడు. 15 ఏళ్ల వయసులోనే రికార్డుల మీద రికార్డులు కొల్లగొడుతున్నాడు. బిహార్‌కు చెందిన వైభవ్.. గతేడాది రాజస్థాన్ రాయల్స్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. ఆడిన మూడో మ్యాచ్‌లోనే 35 బంతుల్లో సెంచరీ బాదేశాడు. ఈ సీజన్‌లోనూ 36 బంతుల్లో శతక్కొట్టాడు. సంచలన ఆటతో అందరినీ ఆశ్చర్యపరుస్తోన్న వైభవ్.. ఆరెంజ్ క్యాప్ రేసులోనూ ఉన్నాడు. అయితే ఇలాంటి ఆటగాడు వచ్చిన బిహార్‌కూ ఓ ఐపీఎల్ జట్టు ఉండాలని బిలియనీర్ అనిల్ అగర్వాల్ వెల్లడించారు. భారత్‌లోనే అతిపెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఒకటైన వేదాంతా గ్రూప్‌నకు ఆయన ఛైర్మన్. కాగా ఆయన చేసిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్‌లా బిహార్‌కు కూడా అద్భుతమైన జట్టు ఉండాలి కదా? బిహార్ గడ్డ ఎంతో మంది నాణ్యమైన క్రికెటర్లను దేశానికి అందించింది. పట్నాలో జన్మించిన ఇషాన్ కిషన్ వన్డేల్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ చేశాడు. సమస్తిపూర్ నుంచి వచ్చిన వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ అరంగ్రేటంలోనే రికార్డులు సృష్టించాడు. సాకిబ్ హుస్సేన్(ఎస్ఆర్‌హెచ్) గోపాల్‌గంజ్‌లోని ఓ సాధారణ కుటుంబానికి చెందిన ప్లేయర్. ఇలాంటివన్నీ చూసినప్పుడు నాకు ఒకటే అనిపించేది. ఎందుకు క్రికెట్‌లో బిహార్‌కు గుర్తింపు రావడం లేదు? బిహార్ యువత ప్రతి రంగంలోనూ రాణించేలా అవకాశాలు కల్పించి.. మన క్రీడాకారులకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహం అందించేలా చేయడం నా చిరకాల కోరిక. బిహార్ నుంచి వచ్చే జట్టు ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా నిలుస్తుందన్న పూర్తి నమ్మకం నాకుంది' అని అనిల్ అగర్వాల్ పోస్టులో పేర్కొన్నారు.




ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రయాణం ప్లే ఆఫ్స్‌కు ముందే ముగిసింది. గుజరాత్ టైటాన్స్‌పై తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఘోర ఓటమితో చెన్నై టోర్నీ నుంచి నిష్క్రమించింది. దీంతో సీఎస్కే వరుసగా మూడోసారి టాప్ 4లో చోటు దక్కించుకోలేకపోయింది. ఈ సీజన్‌లో సీఎస్కే చేసిన అత్యంత పేలవ ప్రదర్శనలపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ సీఎస్కే వైఫల్యాలపై తనదైన శైలిలో విశ్లేషణ చేశాడు.

'ఈ సీజన్‌లో సీఎస్కే ఎదుర్కొన్న అతిపెద్ద సమస్య బ్యాటింగ్. ధోని, బ్రెవిస్, మాత్రే, ఖలీల్ వంటి కీలక ప్లేయర్లు గాయాల కారణంగా జట్టుకు దూరమయ్యారు. ఇది జట్టును తీవ్రంగా దెబ్బతీసింది. ధోని లేని లోటు జట్టులో స్పష్టంగా కనిపించింది. అయితే ప్రధాన సమస్య మాత్రం బ్యాటింగ్‌లో నిలకడ లేకపోవడమే. ఇతర జట్లతో పోలిస్తే సీఎస్కే బ్యాటర్లు స్థిరంగా రాణించలేదు. 180-190 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోయారు. తొలుత బ్యాటింగ్ చేసినా 160 పరుగులుకే పరిమితం అయ్యారు. ముఖ్యంగా మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు పూర్తిగా తేలిపోయారు. గత సీజన్‌లో ఆకట్టుకున్న డేవాల్డ్ బ్రెవిస్ ఈసారి అంచనాలకు తగ్గట్టు రాణించలేకపోయాడు. సర్ఫరాజ్ ఖాన్, ఆయుశ్ మాత్రే, ఉర్విల్ పటేల్ నిలకడగా ఆడలేకపోయారు. బౌలింగ్ విభాగంలోనూ జట్టు ఆశించిన స్థాయిలో ఆడలేదు' అని సెహ్వాగ్ విశ్లేషించాడు. ఐదుసార్లు ఐపీఎల్ ఛాంపియన్ అయిన సీఎస్కే.. చివరిసారిగా 2023లో ఎంఎస్ ధోని నాయకత్వంలో ట్రోఫీని ముద్దాడింది. ఈ సీజన్‌లో ధోని ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. జట్టు ఇప్పుడు మార్పుల దశలో ఉందని, ప్లేయర్లు నిలకడ సాధించేందుకు కాస్త సమయం పడుతోందని కోచ్ వెల్లడించిన సంగతి తెలిసిందే.




స్పోర్ట్స్ డెస్క్: ఐపీఎల్ 2026 లీగ్ చివర్లో వరుసగా 3 మ్యాచ్‌ల్లో ఓడిపోయి చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడం అభిమానులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. టోర్నీ ఆరంభంలో అద్భుత విజయాలతో టాప్-4 రేసులో బలంగా కనిపించిన సీఎస్కే.. ముగింపు దశలో వరుస పరాజయాలతో టోర్నీ నుంచి వైదొలిగింది. గురువారం గుజరాత్ టైటాన్స్ జట్టుతో జరిగిన డూ ఆర్ డై మ్యాచ్‌లో 89 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ భారీ ఓటమిని అభిమానులు అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌ను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా కొందరు ఫ్యాన్స్ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు.

రుతురాజ్ గైక్వాడ్‌పై జరుగుతున్న ఈ హేయమైన ట్రోలింగ్‌ను చూసి భారత సీనియర్ స్పిన్నర్, సీఎస్కే మాజీ ప్లేయర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. రుతురాజ్‌కు మద్దతుగా నిలుస్తూ అభిమానులకు చిన్న హెచ్చరిక చేశాడు. రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ.. 'నేను ఎప్పుడూ చెబుతుంటాను, రుతురాజ్ చాలా మంచి ఆటగాడు. కొందరు వ్యక్తులు అతన్ని ఎందుకు అంత దారుణంగా విమర్శిస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. రుతురాజ్ లాంటి ఆటగాడిపై ఇలాంటి విమర్శలు మంచిది కాదు. కెరీర్‌లో ఎవరికైనా ఎప్పుడైనా గడ్డు కాలం రావచ్చు. సమయం ఎప్పుడూ ఒకేలా ఉండదు. సమయం అందరికీ మారుతుంది. అంతమాత్రానికే ఒక ఆటగాడిని వ్యక్తిగతంగా దూషించడం, ట్రోల్ చేయడం సరైనది కాదు' అంటూ అశ్విన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు.

ఇక చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు ఈ స్టార్ స్పిన్నర్ అభిమానులకు ఓ కీలక విజ్ఞప్తి చేశాడు. ధోనీ సారథిగా ఉన్నప్పుడు జట్టుపై ఎలాంటి అంచనాలు పెట్టుకునేవారో.. ఇప్పుడు కూడా అలాంటివే ఆశించడం మానుకోవాలని సూచించాడు. ' గత 18 ఏళ్లుగా ధోనీ, సీఎస్కే కలిసి ప్రతిసారీ గెలవడం, ప్లేఆఫ్స్ చేరడం వంటి అలవాట్లను ఫ్యాన్స్‌కు నేర్పించారు. కానీ ఇప్పుడు ఐపీఎల్‌లో 10 జట్లు ఉన్నాయి. ప్రతి జట్టు అద్భుతంగా ఆడుతోంది. ఏ జట్టునైనా ఎవరైనా ఓడించగలరు. ఈసారి పాయింట్ల పట్టికలో తనకంటే కింద ఉన్న జట్లపై మాత్రమే సీఎస్కే గెలిచింది. కాబట్టి వారు భవిష్యత్తులో మరింత కష్టపడాలి. అలానే ఈసారి చెన్నై మంచి ప్రదర్శన చేయలేదనే విషయాన్ని అందరూ గ్రహించాలి' అని రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు.



# ఖండాంతరాల్లో ఆమె స్ఫూర్తి

**ఆమె పుట్టింది పల్లెటూరిలో.. ఆరుగురు ఆడపిల్లల కుటుంబంలో కట్టుబాట్లు, ఆర్థిక పరిమితులు.. అయినా 'నేను చేయగలను' అనే ఆత్మవిశ్వాసం ఆమె ఆయుధం. న్యూజిలాండ్, అమెరికా.. ఆ తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై అడుగుపెట్టి, ఐటీ రంగంలో ఎగ్జిక్యూటివ్ లీడర్‌గా ఎదిగి, అక్కడి రాజకీయాల్లోనూ తెలుగు గళాన్ని వినిపించిన హైమారెడ్డి ఉల్పాల ప్రస్థానం ఇది. "తెలంగాణలోని నారాయణపేట జిల్లా నిడుగుర్తి నేను పుట్టిన ఊరు.**

**మా నాన్న నర్సిరెడ్డి డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేసేవారు. ఉద్యోగ రీత్యా ఆయన నిరంతరం బదిలీలపై వెళ్తుంటే.. మా అమ్మ రుక్మిణి ఒకవైపు వ్యవసాయాన్ని చూసుకుంటూనే ఆరుగురు పిల్లలను క్రమశిక్షణతో పెంచారు. చదువుకోకపోయినా అమ్మలో అసాధారణమైన నాయకత్వ లక్షణాలు ఉండేవి. వ్యవసాయాన్ని మేనేజ్ చేయడం, కూలీలను చూసుకోవడం, ఊరిలో ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలబడటాన్ని చూస్తూ పెరిగాను. ఆ ధైర్యం, ఆ నాయకత్వ లక్షణాలు తెలియకుండానే నాకు ఒంటబట్టాయి. అందుకే ఎన్ని అడ్డంకులు ఎదురైనా తలవంచడం ఎరుగను.**

### నెరవేరని డాక్టర్ కల

ఆడపిల్లల చదువుల కంటే పెళ్లిళ్లకే అత్యంత ప్రాధాన్యం ఇచ్చే రోజులు అవి. ఆరుగురు అమ్మాయిలకు కట్నాలు ఇచ్చి పెళ్లిళ్లు చేయడం నాన్నకు భారమని చుట్టుపక్కల వారు అంటున్నా, చదువుపై నాకున్న ఇష్టాన్ని నా తల్లిదండ్రులు ఏనాడూ కాదనలేదు. నిజానికి నేను డాక్టర్ కావాలని ఎన్నో కలలు కన్నాను. కానీ, ర్యాంకింగ్ సమీకరణల వల్ల ఆ కల నెరవేరలేదు. అయినా నిరాశ చెందకుండా పోలీస్ ఫోర్స్‌లో చేరాలని శ్రమించాను. కానీ, అక్కడ కూడా అదృష్టం కలిసి రాలేదు. అయితే, డిగ్రీ చేస్తున్న సమయంలో హాబీగా నేర్చుకున్న కంప్యూటర్ ప్రోగ్రామింగ్ నా జీవితాన్ని ఇంతటి ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని అప్పుడు ఊహించలేదు.

### న్యూజిలాండ్‌లో తొలి అడుగులు

నాగర్‌కర్నూల్‌కు చెందిన రాజవర్ధన్‌రెడ్డితో వివాహం జరిగాక సరికొత్త ఆశలతో న్యూజిలాండ్ చేరుకున్నాను. కొత్త దేశం, అర్థం కాని ఇంగ్లిష్.. ఉద్యోగాలు దొరకని పరిస్థితి.. అన్నీ సవాళ్లే, అయినా వెనక్కి తగ్గలేదు. మొదట్లో ఒక ఇండియన్ రెస్టారెంట్‌లో అతి తక్కువ జీతానికి పనిచేశాను. ఆ తర్వాత మెక్‌డొనాల్డ్స్‌లో అవకాశం వచ్చింది. అక్కడ పనిచేస్తూనే కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాను. పగలు పనిచేస్తూ, రాత్రిళ్లు ఐటీ నైపుణ్యాలకు పదును పెట్టుకుంటూ నా కెరీర్‌కు గట్టి పునాదులు వేసుకున్నాను. అపై అమెరికా వెళ్లి మరింత అనుభవాన్ని గడించి మళ్లీ న్యూజిలాండ్ చేరుకున్నాను. ఆ అనుభవమే నన్ను ఒక పటిష్టమైన వృత్తి నిపుణురాలిగా తీర్చిదిద్దింది.

### ఆస్ట్రేలియాలో తెలుగు జెండా

2000వ సంవత్సరంలో న్యూజిలాండ్ నుంచి ఆస్ట్రేలియా చేరుకున్నాను. మెల్‌బోర్న్‌లో స్థిరపడ్డాను. అక్కడ అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించాను. ప్రస్తుతం ఆస్ట్రేలియన్ రీసెర్చ్ డేటా కామన్స్ (ఏఆర్‌డీసీ)లో ఎగ్జిక్యూటివ్ లీడర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ, అక్కడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో నా ముద్ర వేశాను. నా జీవితంలో అత్యంత గర్వపడే ఘట్టం.. ఆస్ట్రేలియా స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడం. ఈ ఎన్నికల బరిలో నిలిచిన తొలి భారతీయ, తెలుగు మహిళగా చరిత్ర సృష్టించాను. 2016 కౌన్సిల్ ఎన్నికల్లో స్థానిక అభ్యర్థులకు నేను గట్టి పోటీ ఇచ్చాను. గెలవకున్నా ఆ ఎన్నికలు నాకు ఒక మరుపురాని జ్ఞాపకంగా మిగిలిపోయాయి.

### ఉత్సవంలా సంక్రాంతి పండుగ

ఎక్కడ ఉన్నా, పదవులు ఉన్నా, లేకున్నా మన మూలాలు మరచిపోకూడదన్నది నా సిద్ధాంతం. అందుకే ఆస్ట్రేలియాలోని తెలుగు పిల్లలు మాతృభాషకు దూరం కాకూడదని పదేళ్లపాటు స్వచ్ఛందంగా తెలుగు స్కూల్ నడిపాను. సంకాంత్రి పండుగను ఆస్ట్రేలియా గడ్డపై ఒక ఉత్సవంలా మార్చి వేలాదిమంది భారతీయులను ఏకం చేశాను. ముగ్గుల పోటీలు, గాలిపటాల పండుగతో ఆస్ట్రేలియా వీధుల్లో తెలుగుదనాన్ని నింపాను. నా ఈ కృషిని గుర్తించి 'అమెరికన్ తెలుగు అసోసియేషన్' వారు 'ప్రవాస భారతీయ అవార్డు'తో నన్ను గౌరవించడం నా బాధ్యతను మరింత పెంచింది.

### విద్యార్థులకు దిక్సూచి

నా ప్రస్థానంలో నాకు అత్యంత సంతృప్తినిచ్చే విషయం.. మన దేశం నుంచి వచ్చే విద్యార్థులకు దిశానిర్దేశం చేయడం. భారత్ నుంచి, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిమంది విద్యార్థులు ఎన్నో కలలతో ఆస్ట్రేలియా వస్తుంటారు. ఇక్కడకు వచ్చాక వాస్తవ పరిస్థితులు తెలిసి దిక్కుతోచని స్థితిలో పడిపోతుంటారు. అలాంటి వారికి ఒక భరోసాలా నిలబడాలని నేను సంకల్పించాను. స్థానిక కాలేజీలు, యూనివర్సిటీలతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థి ఆసక్తిని బట్టి ఏ కోర్సు చదివితే బాగుంటుంది? ఏ యూనివర్సిటీలో ఫీజులు తక్కువ, అవకాశాలు ఎక్కువ.. అన్న విషయాలపై పూర్తి అవగాహన కలిస్తున్నాను. ఏ ప్రతిఫలం ఆశించకుండా నేను చేస్తున్న ఈ సేవ విద్యార్థుల కెరీర్ గ్రోత్‌కు తోడ్పడుతోంది. వేల మైళ్ల దూరంలో ఉన్న తమ బిడ్డలు హైమారెడ్డి పర్యవేక్షణలో సురక్షితంగా ఉన్నారన్న భరోసా భారత్‌లోని వారి తల్లిదండ్రులకు కొండంత అండ. విద్యార్థి దశ నుంచి వారిని గ్లోబల్ ప్రొఫెషనల్స్‌గా మార్చే ఈ ప్రయాణంలో నేను పొందే ఆనందం వెలకట్టలేనిది. నా సేవాభావం గురించి తెలుసుకున్న భారత్‌లోని ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలు, కాలేజీలు నాతో కలిసి పనిచేసేందుకు ముందుకు వస్తున్నాయి. వారి విద్యార్థులకు దిశానిర్దేశం కోసం నన్ను సంప్రదిస్తున్నాయి.

# ప్రజా పాలనతో మన జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలి

నాగర్ కర్నూల్ ప్రతినిధి : ప్రజా పాలనలో నాగర్ కర్నూల్ జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తే జిల్లా అభివృద్ధి వేగంగా జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా కృషి చేసి, నాగర్ కర్నూలు జిల్లాకు రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించడం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజా పాలనను ఆదర్శంగా నిలపాలని మంత్రి ప్రజా ప్రతినిధులు, అధికారులకు పిలుపునిచ్చారు.

శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా జిల్లా కేంద్రంలోని గగ్గలపల్లి తేజ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాస్థాయి ప్రజా పాలన సమావేశాన్ని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ శాసనమండలి సభ్యులు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా స్థాయి ప్రజా పాలన సమావేశాన్ని ప్రారంభించారు.

ముందుగా తెలంగాణ జాతీయ గీతాలాపనతో ప్రారంభమైన కార్యక్రమం అనంతరం,జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాలో మార్చ్ 6 నుంచి అమల చేసిన కార్యక్రమాలపై ఈ అవగాహన సదస్సులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పది అంశాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల పై అధికారులు శాఖల వారీగా తెలియపరిచారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ......, ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం ఒక్కొక్కటి అమలు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని, మహిళల ఆర్థిక అభివృద్ధిని పెంపొందించే విధంగా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అనేక కొత్త పథకాలను అమలు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.ఉమ్మడి పాలమూరు జిల్లా రైతుల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.గత ప్రభుత్వ ఆర్థిక విధానాల కారణంగా రాష్ట్రంపై భారీ అప్పుల భారం పడిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత పదేళ్లలో రూ. 8 లక్షల కోట్ల మేర అప్పులు చేశారని మంత్రి ఆరోపించారు. ఈ అప్పుల కారణంగా ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 6500 కోట్ల వరకు వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. గతంలో 22 మంది ముఖ్యమంత్రులు 64 సంవత్సరాల పాలనలో మొత్తం రూ. 65 వేల కోట్ల అప్పులు మాత్రమే చేశారని, కానీ గత ప్రభుత్వం కేవలం పదేళ్ల వ్యవధిలోనే భారీ అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి పెట్టిందని మంత్రి తెలిపారు.రాష్ట్రం ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం ఎలాంటి వెనుకడుగు వేయడం లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు



చేస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు.మహిళల సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొంటూ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించామని తెలిపారు. అదేవిధంగా, గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ సామాన్య ప్రజలకు ఊరటనిస్తున్నామని చెప్పారు. పెరుగుతున్న ధరల భారాన్ని తగ్గించేందుకు రూ. 500కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు.పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టామని, అర్హులైన కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. గృహరహిత పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా స్వంత ఇల్లు కల కల్పిస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రైతు రుణమాఫీ అమలు చేస్తున్నామని, రైతు భరోసా ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. అదనంగా, సన్న ధాన్యం పండించే రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని, స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని, పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తోందని జూపల్లి కృష్ణారావు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాబోయే రెండున్నర సంవత్సరాల్లో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంను ప్రారంభించేలా చర్యలు వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు.రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా లాంచ్ అనంగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3 వేల 500 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, జూన్ రెండో తేదీన ఒక లక్ష ఇండ్లు గృహప్రవేశాలు జరగనున్నాయని, ముఖ్యమంత్రి అదిలాబాదులో గృహప్రవేశాల కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు మంత్రి తెలిపారు. పాలమూరు ప్రాంతం ఎన్నో దశాబ్దాలుగా సాగునీటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. ఈ ప్రాంత రైతుల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలంటే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కీలకమని పేర్కొన్నారు. గతంలో ఈ ప్రాజెక్టుకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల పనులు నెమ్మదించాయని ఆయన విమర్శించారు.ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసినప్పటికీ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని, కానీ గత పాలకులు పాలమూరు ప్రాంత రైతుల అవసరాలను పట్టించుకోలేదని అన్నారు.

ప్రస్తుత ప్రభుత్వం మాత్రం రైతు సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సాగునీటి వనరుల విస్తరణతో పాటు, ఎండబారిన భూములకు నీరు అందించి రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చడమే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. పాలమూరు--రంగారెడ్డి పథకం పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా, తాగునీటి సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుందని వివరించారు.శాసనమండలి సభ్యులు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ,........ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా ప్రజాప్రతినిధులు మరియు అధికారులు వారధిగా పని చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు జిల్లాలోని ప్రతి అర్హుడైన లబ్ధిదారునికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. మార్చి 6వ తేదీ నుంచి జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల అమలులో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించారని కలెక్టర్ ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సూచనల మేరకు జిల్లాలోని వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 5,000 ఫైళ్లను రానున్న 15 రోజుల్లో పూర్తిస్థాయిలో క్లియరెన్స్ చేసే విధంగా అధికారులు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రతి శాఖ అధికారి పెండింగ్ దరఖాస్తులు, ఫైళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయడం ప్రతి ప్రభుత్వ అధికారుల బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవా దృక్పథంతో పనిచేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు సాకారం అవుతాయని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్ దేవ సహాయం, నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి తదితర ప్రజా ప్రతినిధులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# Cinema




టాలీవుడ్‌లో టాలెంట్‌కు కేరాఫ్ అడ్రస్‌గా చెప్పుకునే హీరోలలో సత్యదేవ్ ఒకరు. ఎప్పటికప్పుడు వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తూ హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సత్యదేవ్ నటిస్తోన్న నూతన చిత్రానికి ఓ పవర్ ఫుల్ టైటిల్‌ని ఖరారు చేస్తూ.. శుక్రవారం (మే 22) ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. సత్యదేవ్ నటిస్తోన్న 16వ చిత్రమిది. ఈ చిత్రానికి 'సమవర్తి' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ, విడుదల చేసిన ఫస్ట్ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

'సమవర్తి' సినిమాను రుద్ర పిక్చర్స్ అండ్ పంచభూత ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి నిర్మిస్తున్నారు. అజయ్ నాగ్. వి దర్శకత్వంలో ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. త్వరలోనే తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకువచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

ఈ పోస్టర్‌లో సత్యదేవ్ చుట్టూ గొడ్డళ్లు, కత్తులతో కొందరు దూసుకు వస్తుండగా.., ఆయన ఎలాంటి భయం లేకుండా హెడ్ ఫోన్స్‌లో పాటలు వింటూ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఇంతకు ముందు ప్రకృతి, అడవి వాతావరణాన్ని బలంగా ప్రతిబింబించిన ప్రీ-లుక్ పోస్టర్.. ఈ సినిమా గురించి అంతా మాట్లాడుకునేలా చేసింది. ఇప్పుడు విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో, సత్యదేవ్ వెనుక కనిపించే పులి, కుందేలు ద్వారా ప్రకృతికి సంబంధించిన అంశాన్ని ఇందులో చేర్చి మరింత ఆసక్తిని పెంచారు. సత్యదేవ్ కెరీర్‌లో ఇదొక హై ఇంటెన్స్ యాక్షన్ మూవీ అవుతుందనే అంచనాలు టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌తో క్లారిటీ ఇచ్చారు మేకర్స్. ప్రత్యేకంగా ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ అనే కొత్త జానర్ ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఎక్స్‌పెక్టేషన్స్‌ను పెంచుతోంది. మొత్తంగా అయితే.. సత్యదేవ్ ఫుల్-ఫ్లెడ్జ్ యాక్షన్ స్పేస్ వైపు గేర్ మార్చినట్లుగా ఈ పోస్టర్ తెలియజేస్తోంది. చూద్దాం మరి.. ఈ జానర్‌లో ఆయన ఎలాంటి సక్సెస్‌ని అందుకుంటారో?




బాలీవుడ్ క్వీన్, లోక్ సభ సభ్యురాలు కంగనా రనౌత్ సీక్రెట్ గా పెళ్లి చేసుకుందా.. నిజమేనా. ప్రస్తుతం బాలీవుడ్ ని ఊపేస్తున్న ప్రశ్న ఇది. అసలు అందరిలో ఈ అనుమానం ఎందుకు వచ్చింది అంటే.. తాజాగా కంగనా.. మెడలో మంగళసూత్రం, నుదుటన సిందూరం, చేతులకు మట్టి గాజులతో కనిపించిన ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ లుక్ చూసి కంగనా ఎవరికీ చెప్పకుండా రహస్యంగా పెళ్లి చేసుకుందా? అంటూ నెట్టింట జోరుగా ప్రచారం సాగింది. ఎప్పుడూ ఒంటరిగా, ఫైర్ బ్రాండ్‌గా ఉండే కంగనా సడన్‌గా ఇలాంటి లుక్‌లో కనిపించడంతో.. నెటిజన్లు ఆమెకు పెళ్లి అయిపోయిందంటూ రకరకాల ఊహాగానాలు మొదలుపెట్టారు. ఇక ఎప్పుడూ ఏ అనుమానాలకు తావు ఇవ్వని కంగనా.. తాజాగా ఈ రూమర్లపై స్వయంగా స్పందించి అసలు నిజాన్ని వెల్లడించింది. నేను రోజూ ఏదో ఒక షూటింగ్‌లలో పాల్గొంటూ ఉంటాను. ఎవరో ఒకరు నా క్యారెక్టర్ మేకప్‌లో ఉన్నప్పుడు ఈ ఫోటో, వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ఉంటారు. ఇది కూడా అలాగే జరిగింది. నేను షూటింగ్ నుంచి వస్తున్న సమయంలో ఎవరో ఫోటో తీసి పోస్ట్ చేశారు. దీనివల్ల నాకు ఇప్పుడు చాలా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. అయినా పెళ్ళయ్యిన మహిళ లుక్‌లో కనిపించడంలో అంత పెద్ద విషయమేముంది? నటీనటులు అన్ని రకాల పాత్రలు పోషిస్తుంటారు కదా. అయినా నేను రహస్యంగా పెళ్లి చేసుకోను, మీకు మాట ఇస్తున్నాను' అంటూ చెప్పుకొచ్చింది. దీంతో ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు. ఇక కంగనా ఈ లుక్ వెనుక విషయం ఏంటంటే.. ఆమె నటించిన బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రం క్వీన్ కి సీక్వెల్ అయిన క్వీన్ 2 షూటింగ్‌ను ముంబైలో ప్రారంభించారు. వికాస్ బాల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలోని ఒక కీలకమైన సీన్ కోసమే కంగనా ఈ మంగళసూత్రం ధరించినట్లు సమాచారం. ఏదిఏమైనా కంగనా పెళ్ళి అయిన మహిళ లుక్ లో చాలా బావుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.




ప్రముఖ నిర్మాత, పంపిణీదారుడు చదలవాడ శ్రీనివాసరావును ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్.డి.సి. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ గా నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు చదలవాడ శ్రీనివాసరావును కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఫిలిమ్ ఫెడరేషన్‌కు శాశ్వత భవనం లేదనే విషయాన్ని నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. అలాగే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సినీ కార్మికులను ఒకే తాటి మీదికి తీసుకుని వచ్చి వారికి ఉపాధి కలిగే విధానాన్ని విధానాన్ని ప్రవేశ పెట్టేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫెడరేషన్ నాయకుల విజ్ఞప్తికి స్పందించిన చదలవాడ శ్రీనివాసరావు ప్రభుత్వం నుంచి స్థలం సేకరించుకోమని, ఆ స్థలంలో అన్ని సౌకర్యాలతో దేశంలో మరే సినీ ఫెడరేషనన్‌కు లేనంత మంచి భవనం నిర్మించి ఇస్తానని, ఈ భవనం కోసం ఎవరినీ రూపాయి విరాళం అడగవద్దని సూచించారు. మహానటుడు ఎన్టీఆర్ పేరు మీద ఈ భవనం నిర్మించి ఇస్తానని చదలవాడ హామీ ఇచ్చారు. చిత్రపురి కాలనీకి కోట్లాది రూపాయల రుణం ఇచ్చి ఆ కాలనీ బ్యాంక్ ఆక్షన్ కు వెళ్లకుండా కాపాడారు చదలవాడ శ్రీనివాసరావు. వందలాది సినీ కార్మికుల కుటుంబాల సొంతింటి కలను బతికించారు. ఇప్పుడు సినీ కార్మికులకు ఆయన తాజాగా మరో వరాన్ని ఇచ్చినట్టు అయ్యింది.




ఏజెంట్ వంటి భారీ డిజాస్టర్ తర్వాత అక్కినేని హీరో అఖిల్ చాలా గ్యాప్ తీసుకుని నటిస్తున్న చిత్రం లెనిన్. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌పై అక్కినేని అభిమానులు భారీ అంచనాలే పెట్టుకున్నారు. ఈ చిత్రంలో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మొదట ఈ సినిమాను మే నెలలో విడుదల చేయాలని భావించారు. కానీ అదే సమయానికి మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పెద్ది సినిమా రేసులోకి రావడంతో, అనవసరమైన బాక్సాఫీస్ క్లాష్ వద్దనుకుని జూన్ 26 కి వాయిదా పడింది.

ఇక నాగార్జున స్వయంగా ఈ సినిమా ఫస్ట్ కట్ చూసి, సినిమా అవుట్‌పుట్ చాలా బావుందని, ఎంతో గర్వంగా, నమ్మకంగా ఉన్నట్లు చెప్పడంతో అయ్యగారు ఈసారి ఎలాగైనా హిట్ కొడతాడని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.అంతే కాకుండా మూడేళ్ల విరామం తర్వాత అఖిల్ నుండి వస్తున్న సినిమా కావడంతో ఇది అతని కెరీర్‌కు అత్యంత కీలకంగా మారింది. అయితే లెనిన్ రిలీజ్ ఇంకా నెల కూడా లేదు. ఇప్పటివరకు మేకర్స్ ఒక్క ప్రమోషన్ కూడా స్టార్ట్ చేయకపోవడంతో ఫ్యాన్స్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా లెనిన్ ఈసారి కూడా వాయిదా పడుతోందని వార్తలు వినిపిస్తున్నాయి. అందుతున్న సమాచారం ప్రకారం లెనిన్ షూటింగ్ ఇంకా ఫినిష్ కాలేదని తెలుస్తోంది. అందుకే ప్రమోషన్స్ వేగవంతం చేయలేదని సమాచారం. ఈ వార్తా తెలియడంతో అక్కినేని ఫ్యాన్స్ టెన్షన్ పడుతున్నారు. అఖిల్ సినిమాకు ఇప్పుడు ప్రమోషన్స్ చాలా ముఖ్యం. ఇప్పటి నుంచి స్టార్ట్ చేస్తేనే అయ్యగారి సినిమాకు హైప్ వస్తుంది. కానీ, అది జరిగేలా కనిపించడం లేదు. చివరి నిమిషంలో ప్రమోషన్స్ అంటే అయ్యగారికి చాలా కష్టమైపోతుంది. ఇప్పుడైనా మేకర్స్ ఈ విషయాన్ని గుర్తించి కొంచెం సౌండ్ పెంచితే బావుంటుందని ఫ్యాన్స్ అంటున్నారు. మరి లెనిన్ మేకర్స్ ఎలాంటి ప్రమోషన్స్ తో వస్తారో చూడాలి.




ప్రస్తుతం ఇండస్ట్రీలో రీఎంట్రీలు చాలా స్పెషల్ గా ఉంటున్న విషయం తెల్సిందే. ఒకప్పుడు ప్రేక్షకులను అలరించిన నటీనటులు మధ్యలో ఫ్యాప్ తీసుకొని సరికొత్తగా రీఎంట్రీలు ఇస్తూ అభిమానులను అలరిస్తున్నారు. ఇప్పటికే చాలామంది సీనియర్ హీరోలు విలన్స్ గా, సపోర్టింగ్ రోల్స్ చేస్తూ మెప్పిస్తున్నారు. తాజాగా మరో సీనియర్ హీరో టాలీవుడ్ కి రీఎంట్రీ ఇస్తున్నారు. ఆయనే వడ్డే నవీన్ పెళ్ళి సినిమాతో నవీన్ ఎంతో మంచి గుర్తింపును అందుకున్నారు. ఆ తరువాత ఎన్నో కుటుంబ కథా చిత్రాల్లో నటించి మెప్పించిన నవీన్ కొంత గ్యాప్ తీసుకొని ట్రాన్స్ ఫర్ త్రిమూర్తులు సినిమాతో మళ్ళీ హీరోగా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యారు. కమల్ తేజ్ నార్ల దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాను వడ్డే నవీనే నిర్మించడం విశేషం. ఇక ఈ సినిమాలో రాశీ సింగ్ హీరోయిన్ గా నటిస్తోంది.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085